# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 15-3-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:178 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

రాజ్యాంగం నిత్య జపం
రాజకీయ మంత్రం
మళ్లీ గెలిస్తే సమూలంగా
మార్చే వాళ్ల కుతంత్రం.

మనుస్మృతి ఎజెండానే
మనసుల్లో వాళ్ల శ్రుతి
అందుకొరకే ఆలాపన
అవుతున్నది ఉధృతి



-వేల్పుల నారాయణ
9440433475

## మహిళా దినోత్సవం పురస్కారాలను ప్రకటించిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 14: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 19 మంది మహిళలకు తెలంగాణ ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. తానిపర్తి చికిత (ఆటలు), కుదుముల లోకేశ్వరి (ఆటలు), ముక్తేవి భారతి (సాహితి), దివనపల్లి వీణావాణి, ఎస్ జబీన్ (లిటరేచర్-ఉర్దు), బండ సరోజన (ఎడ్యుకేషన్-కరికులం), బిన కేశవరావు (హ్యాండి క్రాఫ్ట్), గుర్రాల సరోజ (సోషల్ సర్వీస్), జమీల నిషత్ (సోషల్ సర్వీస్), అరిపిన జయలక్ష్మి (స్పెషల్ కేటగిరి), దయ్యాల భాగ్య (డాన్స్-ఫిజికల్ ఛాలెంజ్), ప్రొఫెసర్ అరుణ భిక్షు (కూచిపుడి నృత్యం) అవార్డులకు ఎంపిక చేసింది. అలాగే, సునీల ప్రకాశ్ (పేరిణి నృత్యం), బండి రాములమ్మ (బోనాల కోలాటం), గొరిగె నీల (బోనాల కోలాటం), మట్టది సరవ్వ (డప్పు కళాకారిణి), సీహెచ్ పుష్ప (ఏకచక్రపురం రైతు), లుఖ్మా కమ్యూనిటీ (సఫా ఎన్‌జీవో), శక్తి టీమ్ (దక్షిణ మధ్య రైల్వే వుమెన్ ఆర్‌పీఎఫ్)కు అవార్డులను ఎంపిక చేసింది.

# రాజ్యసభ ఎంపీగా సుధామూర్తి ప్రమాణం



న్యూఢిల్లీ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): రాజ్యసభ ఎంపీగా ఇన్ఫోసిస్ వ్యవస్థాపడు ఎన్ఆర్ నారాయణ మూర్తి భార్య సుధామూర్తి గురువారం ప్రమాణం చేశారు. ఆమె భర్త నారాయణమూర్తి సమక్షం లోనే ఈ కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తన ఛాంబర్లో ఆమెతో ప్రమాణం చేయించారు. సభా నాయకుడు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 73 ఏళ్ల సుధామూర్తి గతంలో ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆమె పిల్లల కోసం అనేక పుస్తకాలు రాశారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గత శుక్రవారం రాజ్యసభకు సుధామూర్తిని నామినేట్ చేసింది. కన్నడ, ఆంగ్ల సాహిత్యంలో ఆమె అనేక రచనలు చేశారు. సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం, పద్మశ్రీ (2008), పద్మభూషణ్ (2023) అవార్డులను అందుకున్నారు. టెల్కో కంపెనీలో పనిచేసిన తొలి మహిళా ఇంజినీర్‌గా సుధామూర్తికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రూ. 10 వేల పెట్టుబడితో ప్రారంభించిన ఇన్ఫోసిస్ కంపెనీ ప్రస్తుతం 80 బిలియన్ డాలర్ల కంపెనీగా అవతరించింది. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ భార్య అయిన అక్షత సుధామూర్తి కుమార్తె అన్నది తెలిసిందే

# శనివారం సాయంత్రం వరకూ గ్రూప్-1 దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గ్రూప్-1 దరఖాస్తుల గడువును మరో రెండు రోజులు పొడిగిస్తూ టిఎస్పిఎస్సీ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి దరఖాస్తులకు గురువారం చివరి రోజు కాగా ఈ గడువును శనివారం సాయంత్రం ఐదు గంటలవరకూ పొడిగించారు. అభ్యర్థులనుంచి వచ్చిన డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని టిఎస్పిఎస్సి ఈ నిర్ణయం తీసుకుంది. చివరిరోజు టిఎస్పిఎస్సి సర్వర్ పనిచేయకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే గడువును పొడిగించడంతో వారు తేలిగ్గా ఊపిరితీసుకున్నారు. మొత్తం 563 పోస్టులకు గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వగా, ఇప్పటివరకూ పోస్టులకు 2.70 లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు.

# జమిలి ఎన్నికలపై రాష్ట్రపతికి నివేదికను సమర్పించిన కోవింద్ కమిటీ

**-రెండంచెల విధానాన్ని సూచించిన కోవింద్ కమిటీ**
**-తొలుత, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో పోలింగ్**
**-తర్వాత 100 రోజులకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు**
**-దీనిపై 47 రాజకీయ పార్టీల నుండి అభిప్రాయ సేకరణ.. 32 జమిలికి మద్దతు**
**-ప్రజల నుంచి సలహాలు, సూచనలు కోరిన కమిటి.. 80 శాతం మంది మద్దతు**
**-2029 నాటికి ఏకకాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు**



న్యూఢిల్లీ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): 'ఒకే దేశం? ఒకే ఎన్నికలు' పేరిట దేశంలో అన్ని రకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే ప్రతిపాదనపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం జరిపింది. ఈ నివేదికను గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించింది. ఈ ఉదయం కోవింద్ సహా కమిటీ సభ్యులు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. జమిలి ఎన్నికలపై 18,629 పేజీల నివేదికను ప్రథమ పౌరురాలికి అందజేశారు. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని కమిటీ ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించింది.

### జమిలి పై కమిటీ సూచనలు

జమిలి ఎన్నికలకు కోవింద్ కమిటీ రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో పోలింగ్ నిర్వహించాలని పేర్కొంది. ఆ తర్వాత 100 రోజులకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు జరపాలని నివేదికలో తెలిపింది. ఇందుకోసం రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని కమిటీ సూచించింది. ఇక, మూడు స్థాయిల ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలని తెలిపింది. దాదాపు 190 రోజుల పాటు ఈ అంశంపై కమిటీ అధ్యయనం జరిపింది. పలు రంగాల నిపుణులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. 47 రాజకీయ పార్టీలు దీనిపై తమ అభిప్రాయాలు తెలిపాయి. ఇందులో 32 జమిలికి మద్దతు ఇచ్చాయి. ప్రజల నుంచి కూడా కమిటీ సలహాలు, సూచనలు కోరగా, 21,558 స్పందనలు వచ్చాయి. వీటిలో 80 శాతం మంది ఏకకాల ఎన్నికలను సమర్థించారు. ఇవన్నీ అధ్యయనం చేసిన అనంతరం కమిటీ నివేదిక రూపొందించింది. ఏకకాల ఎన్నికల నిర్వహణపై గత కొన్నేళ్లుగా బలంగా ప్రచారం చేస్తున్న మోడీ ప్రభుత్వం, 2023 సెప్టెంబరులో దీనిపై కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను నియమించింది. కేంద్ర మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో విపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, 15 వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కె సింగ్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కశ్యప్ , సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీలను కమిటీలో సభ్యులుగా చేర్చింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ , కమిటీ సెక్రటరీగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నితిన్ చంద్రలకు బాధ్యతలు అప్పగించింది.

### సిద్ధమవుతున్న లా కమిషన్ నివేదిక

ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంశంపై లా కమిషన్ కూడా తమ నివేదికను దాదాపు సిద్ధం చేసినట్టు తెలిసింది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఒక అధ్యాయాన్ని చేర్చాలని లా కమిషన్ సూచించే అవకాశం ఉందని సమాచారం. 2029 నాటికి ఏకకాల ఎన్నికల నిర్వహణ వీలయ్యేలా చేసేందుకు అవసరమైన మార్గసూచిని లా కమిషన్ ప్రభుత్వానికి అందజేయవచ్చని తెలుస్తోంది.

# వాతావరణ కథనాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలి

**- జర్నలిస్టుల వర్క్ షాప్ లో వక్తలు**

హైదరాబాద్, మార్చి 14:మానవళి మనుగడకు ప్రధాన కారణమైన వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కథనాలకు మీడియా రంగం తగు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రస్తుతం మీడియా సమకాలీన రాజకీయాలు, వ్యాపార సంబంధమైన అంశాలకు తప్ప, కౌన్సెల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులపై జర్నలిస్టులకే ఎక్కువ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచ అభివృద్ధి గమనానికి ప్రధాన కారణమైన వాతావరణ మార్పుల పై మీడియా రంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని భవిష్యత్తులో జరగబోయే విపత్తులను మనం గుర్తించలేకపోతున్నామని ఆయన అన్నారు. ఎలాగైతే భారతదేశంలో ప్రజాస్వామ్యం తగ్గిపోతోందని, ఫాసిజం, నియంతృత్వం పెరిగిపోతుందన్న విషయాన్ని ప్రస్తుతం ఎవరు ప్రపంచవ్యాప్తంగా గోచరిస్తున్న ఈ పరిణామాలపై జర్నలిస్టులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మానవ మనుగడకు కారణమైన వాతావరణ మార్పులపై ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత






సమావేశంలో మాట్లాడుతున్న కె..శ్రీనివాస్ రెడ్డి.ం ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో కె.విరహత్ అలి, కె.శ్రీనివాస్, భాసిత్, కె.శ్రీనివాస్ రెడ్డి, భీమారావు.

ఎంతో కీలకమైన వాతావరణ మార్పుల పై వచ్చే కథనాలకు తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని వారు అభిప్రాయపడ్డారు.

యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ సహకారంతో, తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యూజే) మరియు వ్యూస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో, జర్నలిస్టులకు వాతావరణ మార్పులు అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే వర్క్ షాప్ గురువారం ప్రారంభమైంది. ఈ సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్

కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మానవ తప్పిదాలే ప్రకృతి వైపరీత్యాల రూపంలో సమాజం మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని, ఎంతో కీలకమైన వాతావరణ మార్పులను జర్నలిస్టులు సైతం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

అనంతరం యునైటెడ్ స్టేట్స్ గుర్తు చేశారు. వాతావరణ మార్పులు ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం చేసేందుకు జర్నలిస్టులు ఈ అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉంటే మంచిదన్నారు. ఇలాంటి చక్కటి సదస్సుకు తాము సహకారం అందిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టులు, సమాజం భవిష్యత్తులో రాబోయే విపత్తుల ప్రమాదాల పై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. వాతావరణానికి మీడియాలో తగినంత ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితి లేనప్పటికీ, జర్నలిస్టులు దీనిపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకుంటే ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాలో విస్తృతంగా సమాచారం అందించి ప్రజలను చైతన్యపరచవచ్చునని పేర్కొన్నారు. మీడియా రంగం తాత్కాలికమైన అంశాలకు, రాజకీయ అంశాలకు ఇచ్చినంతగా ప్రాధాన్యం వాతావరణ మార్పులకు ఇవ్వడం లేదన్నారు. మానవాళి మనుగడను ప్రశ్నార్థకంలో పడేస్తూ దీర్ఘకాలికంగా అంతర్లీనంగా కొనసాగుతున్న మార్పులను తద్వారా గుర్తించడం లేదని, మరికొన్ని ఏళ్ళ తర్వాత అది ప్రజలకు అనుభవంలోకి వస్తుందన్నారు. వాతావరణ మార్పులపై ఎవరైనా మాట్లాడినా, దాని ప్రతికూల పరిణామాలపై ఉద్యమించినా దానిని కొన్ని వర్గాలు అభివృద్ధి వ్యతిరేక చర్యగా భావించడం విచారకరమన్నారు. మనుషుల మనుగడ ముడిపడి ఉన్న ప్రకృతి వైపరీత్యాల పై సున్నితంగా ఆలోచించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. నేడు మానవాళికి పట్టణీకరణ ప్రమాదకరంగా మారిందని, ఒకప్పుడు హైదరాబాద్ కు గ్రామాల నుంచి వచ్చేవారు పేదోళ్ల ఊటీగా భావించే ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేదని, ప్రస్తుతం కాలుష్య విషంతో హైదరాబాద్ కొట్టుమిట్టాడుతుందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో వేసవికాలం జనవరి తోనే మొదలయ్యే పరిస్థితి నెలకొందన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రకృతిలో మార్పులు పర్యావరణ విపత్తులు అనేవి ఒక ప్రాంతానికో, దేశానికో పరిమితం కావని, జర్నలిస్టులపై ఉందన్నారు. జర్నలిస్టులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు తమ సంఘానికి అవకాశం కల్పించిన యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిక్షణ తరగతులలో హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల జర్నలిస్టులు, ఎన్టీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్, వ్యూస్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమారావు, యూఎస్ కౌన్సిలేట్ సిపిఆర్ఓ బాసిత్, సీనియర్ పాత్రికేయురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను లింగ వివక్షలేకుండా పెంచాలి : మంత్రి సీతక్క



హైదరాబాద్, మార్చి 14:తల్లిదండ్రులు పిల్లలను లింగ వివక్ష లేకుండా పెంచాలని అప్పుడే వారు ఉన్నత స్థాయికి వెళ్తారని స్త్రీ, శిశుసంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్స్ అచీవర్స్ అవార్డ్సు 2024 ను గురువారం ఘనంగా నిర్వహించారు.

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడిలలో పిల్లలకు నర్సరీ క్లాస్‌లను కూడా ప్రారంభిస్తామని తెలిపారు. నగరంలో ఉండే వలస కూలీలు ఉండే ప్రాంతాల్లో అంగన్‌వాడీ మొబైల్ క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి, వారి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు సానిటరీ న్యాప్కిన్ కిట్స్‌లను అందిస్తామన్నారు. వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలను ఈ సందర్భంగా సన్మానించారు.

# ఫుట్పాత్ ఆక్రమణల్లో నేతల హస్తం..!?

**- "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్"**

హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ; నగరంలో కొందరు చోటా రాజకీయనాయకులు ఫుట్పాత్లు ఆక్రమించి చిరువ్యాపారులకు అద్దెకిస్తూ కోట్లుగాడిస్తున్నారని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్" అధ్యక్షులు రంగయ్య, జాతీయ సలహాదారులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి తదితరులు ఆరోపించారు. ఒకపక్క ఫుట్పాత్ లను మరోపక్క రోడ్ల ఆక్రమణల కారణంగా వాహన రద్దీ తారాస్థాయికి చేరి కర్బన కాలుష్యాలు నగరంలో రాజ్యమేలుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఫుట్ పాత్ వ్యాపారాలు చేసే వారిలో సింహభాగం అద్దె ను స్థానిక నేతలకు చెల్లిస్తున్నారని, అందుకే అధికారులు చర్యలు తీసుకోకుండా ఆ షాడో నాయకులు అడ్డుకుంటున్నారనే ప్రచారం ఉందన్నారు. పోలీస్ అధికారులు కేసులు నమోదు చేసి విచారణ జరిపిస్తే వాస్తవం బయటకు వస్తుందన్నారు. ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగి కాలుష్యాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. తోపుడు బండ్లు, వీధి వ్యాపారులతో ఈ సమస్య ఉత్పన్నం కావడం లేదని ఫుట్ పాత్ లపై స్థిర వ్యాపారం చేయడం వల్లే సమస్య తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల కళ్ళముందే ఆక్రమణలు వ్యవస్థీకృతం అయ్యిందని, ఆ వాహన కాలుష్యాల కారణంగా నగర జనం రోగాల బారిన పడుతోందని కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కోట్ల రూపాయల అక్రమ వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారిన ఈ ఆక్రమణలు నగరంలో ఏ ఒక్క ప్రాంతానికి పరిమితం కాలేదని, తక్షణమే జీ హెచ్ ఎం సి కమిషనర్ తోపాటు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్ లు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ అనేది కీలకమైన ప్రస్తుత తరుణంలో అధికారులు తక్షణమే ఆక్రమణల తొలగింపుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేయాలని వారు కోరారు.

# విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి : ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, మార్చి 14:పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల హాస్టల్ మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో చేపట్టిన మహా దీక్షలో ఆయన మాట్లాడారు. కళాశాల, పాఠశాల, హాస్టల్, గురుకుల పాఠశాల విద్యార్థుల స్కాలర్‌షిప్ లు పెంచి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రంలోని ఎనిమిది లక్షలమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, గురుకుల విద్యార్థులు, 16 లక్షల మంది కాలేజీ విద్యార్థులు చాలిచాలని మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాలు పెంచుతున్న ప్రభుత్వం విద్యార్థుల ఉపకార వేతనాలను విస్మరిస్తుందని ఆరోపించారు. ఆరు సంవత్సరాల క్రితం నాటి ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు చెల్లిస్తుండటం వల్ల నాసిరకం ఆహారాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించే ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం శోచనీయమని, పేద పిల్లలు చదువుకునే హాస్టళ్లను ప్రభుత్వం మానవతా దృక్పతంతో చూడాలని కోరారు. వేముల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన దీక్షలో సంఘం ప్రతినిధులు సుధాకర్, నందగోపాల్, చంద్రశేఖర్‌గౌడ్, నరసింహగౌడ్, కృష్ణయాదవ్, నిఖిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**నేటి కందం- నేటికి అందం**

జనులకు శ్రేష్ఠతమంబౌ
పనితనము నొసంగి సతము పరిరక్షింపన్
వినియోగదార్ల హక్కుల
దినమును జరుపంగ వలయు దేదీప్యముగన్

(మార్చి 15 : ప్రపంచ వినియోగదార్ల హక్కుల దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

# అన్ని సీట్లకు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ పోటీ

హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో పార్లమెంట్ కు, ఆంధ్రప్రదేశ్ లోని శాసన సభ పార్లమెంటుకు జరగబోయే ఎన్నికల్లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ అన్ని స్థానాలకు పో టిచేస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి శివ లెంక ప్రకటించారు. ఉదయలక్ష్మి అధ్యక్షతన సూర్య లోక్ కాంప్లెక్స్ లో అబిడ్స్ కన్వెంద్రీ సూర్యలోక కాంప్లెక్స్ హాలులో జరిగిన పార్టీ మేధోమథనం సమావేశంలో పార్టీకి ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ విభేదాలు పక్కన పెట్టి అన్ని సీట్లకు పోటీ చేయటానికి పార్టీ సభ్యులు , కార్యకర్తలు సమాయత్తం కావాలని ఆమె పిలుపు ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ మాట్లాడుతూ మాతృ ప్రేమతో పరిపాలన నినాదంతో ప్రజల్లోకి వెళుతున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ తరఫున శ్రీ బాలకృష్ణ, నేషనల్ ఫ్రంట్ అధ్యక్షుడు నారిగొని, పార్టీ ఏపీ అధ్యక్షుడు మహేష్, పార్టీ అడ్వైజరు సీనియర్ జర్నలిస్ట్ ఎస్. వి సూర్యప్రకాశరావు,చిత్ర సుజాత అంజనీ రెడ్డి నామిని భాస్కర్ విజయ కనకదుర్గ నందికొండలరావు వాసు ఓ బి సి రమేష్ నల్లగొండ రాజు అరుణ రెడ్డి నవీన్ నవీన రాణి నరసింహ గుప్తా తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో జనతా కాంగ్రెస్ కు చెందిన శివ పావనినేషనల్ ఫ్రంట్ అధికార ప్రతినిధిగా ప్రకటించారు. ఆర్. పీ ఐ మరో నాయకురాలు పుష్ప లత వేముల ప్రత్యేకతిధిగా హాజరయ్యారు

# జీతేందర్‌రెడ్డిని కలిసిన సీఎం రేవంత్

మహబూబ్‌నగర్, మార్చి 14: మహబూబ్ నగర్ మాజీ ఎంపీ, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డిని సీఎం రేవంత్?రెడ్డి కలిశారు. జితేందర్ రెడ్డి బిజెపి పార్లమెంటు సీటు ఆశించి భంగపడ్డారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను స్వయంగా ఇంటికి వెళ్లి కలిశారు.

మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా వంశీ చంద్ రెడ్డి అభ్యర్థిత్వం ఇప్పటికే ఖరారు చేశారు. మరోవైపు బిజెపి డీకే అరుణకు అవకాశం కల్పించారు. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న జితేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు.

2018 ఎన్నికలలో బీఆర్ఎస్ టికెట్ రాకపోవడంతో భారతీయ జనతా పార్టీలో చేరిన జితేందర్ రెడ్డి తనకు ఈసారి తప్పనిసరిగా టికెట్ వస్తుంది అన్న నమ్మకంతో ఉన్నారు.

ప్రధాని మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా తదితరులతో సత్సంబంధాలు ఉన్న కారణంగా తనకు తప్పనిసరిగా టికెట్ వస్తుందని చివరిదాకా ప్రయత్నించారు. కానీ టికెట్ తనకు కాకుండా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు రావడంతో ఆయన తీవ్ర నిరాశ గురయ్యారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జితేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి చర్చలు జరపడం రాజకీయంగా సంచలనం కలిగిస్తోంది. కాంగ్రెస్ పార్టీలోకి రావాలి అని, వస్తే తగిన ప్రాధాన్యత ఇస్తామని సీఎం జితేందర్ రెడ్డికి హామీ ఇచ్చినట్లు సమాచారం.

# రానున్న శతాబ్దం ఇండియాదేనా?

గత దశాబ్ద కాలంలో ప్రపంచం దృష్టిలో భారతదేశ పరువు ప్రతిష్టలు అనూహ్యంగా పెరగడం గమనిస్తూ ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. కరోనా విపత్తును ఓడించడానికి టీకా ఆయుధాన్ని సమర్థవంతంగా, సకాలంలో సంధించి భారతం జయించిన తీరును చూసి అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలు ఆశ్చర్యపడుతూ మంచి గుణపాఠం నేర్చుకున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద టీకా కార్యక్రమాన్ని నిర్వహించి 95 శాతం జనాభాకు కనీసం ఒక డోసు టీకా, 88 శాతం (12 ఏండ్లు దాటిన) జనాభాకు ఇవ్వడంతో పాటు దాదాపు 100 దేశాలకు 40 కోట్ల టీకా డోసుల సహాయాన్ని చేయడంతో భారత దేశ విలువ విశ్వవ్యాప్తం అయ్యింది. మహమ్మారి విజృంభణతో ఇండియా పని అయిపోయిందని ఎగతాళిగా చూసిన దేశాలు భారీ మూల్యాలను చెల్లించవలసి వచ్చింది. కరోనా ప్రళయంతో ప్రపంచ దేశాల ఆర్థిక పునాదులు కదలడం జరిగినా భారత ఆర్థిక స్థితి మాత్రం నిలకడగా ఉండడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. 2014లో ఎన్నికైన నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న పలు దేశాభివృద్ధి చర్యలతో పాటు విలక్షణ విదేశాంగ విధానాలతో తన ప్రత్యేకతలను ప్రదర్శిస్తూ స్వయం ప్రతిపత్తిని నిలుపుకుంటూ అన్ని దేశాలను సమాన దూరాలలో నిలిపి తన చాణక్య నీతిని ప్రదర్శిస్తూ, విశ్వ యవనికపై అందరి ఆమోదాన్ని పొందుతూ, భారత హృదయాన్ని ఆవిష్కరించడం జరుగుతోంది.

బాహుబలిగా ఎదుగుతున్న భారతం:

2022 – 23లో భారతం ప్రతిష్టాత్మక జీ–20 సమూహానికి అధ్యక్షత వహించి అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకొని, సమర్థవంతంగా నిర్వహించి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. యువభారతంలో ప్రగతి పరుగులిడడం, సుస్థిరాభివృద్ధి దిశగా పయనించడం, భవిష్యత్తులో బలీయశక్తిగా ఎదగడం చూస్తున్నాం. ఒకనాడు చులకనగా చూసిన భారతాన్ని నేడు ప్రపంచ అధినేతలు సహితం స్నేహహస్తం అందివ్వడానికి ఒక అడుగు భారత్ వైపు వేయడం చూసి అబ్బురపడుతున్నాం. నేడు భారత విదేశాంగ విధానాలు ప్రశంసనీయంగా మారడం కూడా ఒక శుభపరిణామమే. రష్యా– ఉక్రెయిన్/ పాలస్తీనా–ఇజ్రాయిల్ యుద్ధాలు కొనసాగుతున్న అకాలంతో అమెరికా, రష్యాలకు సమాన దూరాల్లో నిలుస్తున్న భారతం తన ఆలోచనల్లో పరిపక్వతను ప్రదర్శిస్తున్నది. ఇరాన్–సౌదీ అరేబియాల మధ్య కూడా తన సమానత్వ ధోరణిని ప్రదర్శిస్తూ ప్రపంచ దేశాల దృష్టిలో అత్యంత మిత్ర దేశంగా నమ్మకం చూరగొనడం అంత సులభమేమీ కాదు. నరేంద్ర మోదీ దృష్టిలో 'ఇండియా ఫస్ట్' అనే భావన ద్వారా దేశ ప్రజల హితం కోరి పటిష్ట అభివృద్ధి అడుగులు వేయడం అభినందనీయం.

మేకిన్ ఇండియా – విదేశీ పెట్టుబడుల ప్రవాహం:

నేడు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు శాశ్విత సభ్యత్వం ఇవ్వాలనే విషయంలో అనేక ప్రపంచ దేశాలు తమ గొంతును భారత్ పక్షాన వినిపించడం సంతోషదాయకం. జీ–20 సమిట్‌ను నిర్వహించిన ఇండియా ప్రతిష్ట పెరగడంతో ప్రపంచ జీ–7 (కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూకె, జపాన్, యూయస్), యస్‌సిఓ (షాంగై కొఆపరేషన్ ఆర్గనైజేషన్) సంస్థల్లో కూడా దేశ ప్రాధాన్యం పెరిగింది. సార్క్ ప్రాంత దేశాలైన అఫ్ఘానిస్థాన్, నేపాల్, శ్రీలంక లాంటి దేశాలకు అత్యవసర విపత్తు సమయాల్లో సహాయం చేస్తూ ఆయా దేశాల అభివృద్ధిలో భారత పాత్ర అనూహ్యంగా పెరుగుతున్నది. నేడు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో చైనాను దాటుతూ ఇండియా మంచి ఆదరణను పొందడం హర్షదాయకం. కరోనా విపత్తుతో నేటికీ కృంగి పోతున్న చైనాలో విదేశీ పెట్టుబడులు తగ్గడంతో అక్కడ నెలకొల్పిన ప్రఖ్యాత బహుళజాతి కంపెనీలు భారత్‌కు క్యూ కట్టడం మన మోదీ 'మేకిన్ ఇండియా' నినాద విజయంగానే చెప్పవచ్చు. ప్రస్తుతం అనేక బహుళజాతి సంస్థల అధిపతులుగా/సిఈఓలుగా భారతీయులు ప్రపంచ శాస్త్రసాంకేతిక రంగాలను పరుగులు పెట్టించడం, ప్రపంచ దేశాలకు సుశిక్షిత నైపుణ్య మానవ వోథో వనరులను అందించడంతో ఇండియా పేరు విశ్వవ్యాప్తంగా మారుమోగుతోంది. ఇండియాలో సేవా, ఉత్పత్తి, ఔత్సాహికుల విలక్షణ ఆలోచనాశక్తి రంగాలు కొత్త పుంతలు తొక్కుతూ భారత ప్రగతి రథాన్ని పరుగులు పెట్టించడం ప్రపంచ దేశాలను మరో కోణంలో ఆలోచింపజేస్తున్నది. నేడు 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతం రానున్న దశాబ్దంలో 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి కృషి చేస్తూ పరుగులిడుతున్నది. ఇండియా అభివృద్ధి రేటు ఇలాగే 2031 వరకు 11 శాతం కొనసాగితే ప్రపంచంలోనే 2వ లేదా 3వ అతి పెద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని కూడా కొందరు విశ్లేషిస్తున్నారు.

'ఇండియా ఫస్ట్' అనేదే మన విదేశాంగ విధానం:

ప్రపంచ దేశాలు 'జీరో కార్బన్ ఎమిషన్' లక్ష్యాలను తీసుకోవడానికి జంకుతున్న సమయంలో తాము 2070 నాటికి శిలాజ ఇంధనాల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి జీరో కార్బన్ ఉద్గార దేశంగా మారుతుందని ప్రకటించిన మన ప్రధానమంత్రి ముందు చూపు, పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ, హరిత శక్తి వినియోగ ఉద్యమ నేతగా అవతరించడంతో భారత్ నేడు ప్రపంచ దేశాల ముందు ఆదర్శంగా నిలవడం జరుగుతోంది. ఇండియాకు తన అభివృద్ధి ముఖ్యమని పలు మార్లు రుజువు చేసింది. రష్యా – ఉక్రెయిన్/పాలస్తీనా – ఇజ్రాయిల్ యుద్ధాలు భీకరంగా కొనసాగుతున్న తరుణంలో అమెరికా పక్ష దేశాలకు లేదా రష్యాకు వత్తాసు పలకకుండా ఇరుపక్షాలతో తన వ్యాపారాలను కొనసాగిస్తూ 'ఇది యుద్ధ కాలం కాదని' తన ప్రత్యేక అభిప్రాయాన్ని ప్రపంచానికి నాటడం సముచితంగా, అర్థవంతంగా ఉందని విశ్వ మానవాళి ఏకాభిప్రాయానికి రావడం చూస్తున్నాం.

మన రాబోయే ముందు తరాలు భారతాన్ని ఒక పటిష్ట ఆర్థిక వ్యవస్థ కలిగిన ఆరోగ్యకర దేశంగా, సూపర్ పవర్‌గా, అసమానతలు లేని సుందర ప్రదేశంగా మారుతున్నదని ఆనందపడదాం. దేశాభివృద్ధిలో 1.4 బిలియన్ల భారతీయులు తమ వంతు సకారాత్మక చేయూతను అందించాలని



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై ఫిర్యాదులు

## –రోగి మాదిరిగా వెళ్లి ఆరోగ్య కేంద్రాన్ని తనికి చేసిన జిల్లా డిప్యూటీ కలెక్టర్



లక్నో మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో రహస్యంగా తనిఖీ చేయాలని ఐఏఎస్ అధికారిణి నిర్ణయించింది. ముఖం కప్పుకుని రోగి మాదిరిగా ఆ ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సిబ్బందికి షాక్ ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఫిరోజాబాద్‌లోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు ఫిర్యాదులు అందాయి. ఉదయం పది గంటలు దాటినప్పటికీ డాక్టర్లు అందులోబాటులో ఉండటం లేదని ఆరోపణలు వచ్చాయి.కాగా, ఆ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్ కృతి రాజ్ నిర్ణయించింది. దీంతో తనను గుర్తించకుండా ముఖానికి ముసుగు వేసుకుంది. రోగి మాదిరిగా నటించి డాక్టర్ చెకప్‌కు వెళ్లింది. అయితే డాక్టర్ ప్రవర్తన సరిగా లేకపోవడాన్ని అధికారిణి కృతి గ్రహించింది. హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేయగా కొందరు గైర్హాజరైనట్లుగా గుర్తించింది. రిజిస్టర్‌లో కొందరి సంతకాలు ఉన్నా ఆ సిబ్బంది అక్కడ లేకపోవడం, సిబ్బంది సేవల తీరు సరిగా లేకపోవడంపై ఆమె ఆగ్రహించింది.మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్ స్టోర్‌ను కూడా డిప్యూటీ కలెక్టర్ కృతి రాజ్ తనిఖీ చేసింది. స్టాక్‌లో సగానికిపైగా గడువు ముగిసిన మందులు ఉన్నట్లు గుర్తించింది. అక్కడి అపరిశుభ్రత పట్ల కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిపై నివేదిక పంపుతానని వెల్లడించింది. కాగా, ఐఏఎస్ అధికారిణి కృతి ముఖానికి ముసుగు వేసుకుని, సాధారణ రోగి మాదిరిగా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# 18 ఓటీటీలపై కొరడా ఝుళిపించిన కేంద్రం

## –ఓటీటీకి చెందిన 19 వెబ్ సైట్లు, 10 యాప్ లు, 57 సోషల్ మీడియా ప్లాట్ ఫామ్లు బ్లాక్

న్యూ ఢిల్లీ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);యువతరం మినహా థియేటర్లకు వెళ్లేవారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇప్పుడంతా ఓటీటీల్లోనే సినిమాలు చూసి ఎంజాయ్ చేస్తున్నారు. ఎంత పెద్ద సినిమా వచ్చినా.. 'రేపు ఎలాగూ ఓటిటిలో వస్తుంది కదా' అని ఓ నెల రోజులు ఆగి, ఓటిటిలోనే చూస్తున్నారు. వీటికి ఉన్న క్రేజ్ ను గమనించిన నిర్మాతలు తమ సినిమాలను నేరుగా ఓటీటీల్లోనే రిలీజ్ చేస్తున్నారు. పెద్ద పెద్ద నటులు కూడా ఓటీటీల్లో వచ్చే మూవీలు, వెబ్ సిరీస్ లో నటించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.అయితే ఓటీటీల్లో వచ్చే కంటెంట్ లో అసభ్యత, అశ్లీలత ఎక్కువ ఉంటోంది. దాంతో ఇంటిల్లిపాదీ టీవీ ముందు కూర్చుని చూడాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేంద్రం 18 ఓటీటీలపై కొరడా ఝుళిపించింది. ఓటీటీకి చెందిన 19 వెబ్ సైట్లు, 10 యాప్ లు, 57 సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లను కేంద్రం బ్లాక్ చేసింది.నిషేధం వేటు పడిన ఓటీటీల్లో డ్రీమ్ ఫిల్మ్స్, వూవీ, యస్మా, అన్ కట్ అడ్డా, ట్రై ఫ్లిక్స్, ఎక్స్ ప్రైమ్, హంటర్, రాబిట్, ఎక్స్ ట్రా మూడ్, న్యూఫ్లిక్స్, బేషరమ్స్, నియోన్ ఎక్స్ వీఐపీ, మూడ్ ఎక్స్, హాట్ షాట్ విఐపి, ఫ్యూగీ, ప్రైమ్ ప్లే, మోజో ఫ్లిక్స్, చికోఫ్లిక్స్ ఉన్నాయి.

# ధైర్యం ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేయ్...కోమటిరెడ్డికి బూర సవాల్..



అమరావతి, మార్చి 14:బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒకటే అన్న వారిని చెప్పుతో కొడతాం అంటూ హాట్ కామెంట్స్ చేశారు భువనగిరి లోక్ సభ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్. నీకు దమ్ము ధైర్యం ఉంటే.. నీ మంత్రి పదవికి రాజీనామా చేస్తావా.. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ సవాల్ చేశారు.

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం, లింగోజి గూడెం గ్రామాల్లో నేడు ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాకంటే ముందున్న ఎంపీలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు భువనగిరి పార్లమెంట్లో అభివృద్ధి పై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. భువనగిరిలో బీజేపీ గెలవకపోతే శాశ్వతంగా రాజకీయాసన్యాసం చేస్తా అన్నారు.

### బిఆర్ఎస్ తో పొత్తు ఎప్పటికీ ఉండదు..

బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు వర్తమానంలో లేదని, భవిష్యత్తులో కూడా ఉండదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. అలాగే భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధికి బీబీనగర్ ఎయిమ్స్, ఎంఎంటీఎస్ రైలు, కేంద్రీయ విద్యాలయం, 520 కి.మీ జాతీయ రహదారులు తీసుకొచ్చామని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని కోరారు.

భువనగిరి అభివృద్ధి తమ వల్లేనని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. అంతేకాదు భువనగిరిలో బీజేపీ గెలవకపోతే శాశ్వత రాజకీయ సన్యాసం చేస్తానని అన్నారు. నేను గెలిస్తే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేస్తారా.. అని కోరారు. ఈ సవాల్‌ని స్వీకరించే దమ్ము, ధైర్యం కోమటిరెడ్డికి ఉందా అని బూర నర్సయ్య గౌడ్ అన్నారు.

# కర్నాటక కాంగ్రెస్ నేత డికె శివ కుమార్‌తో మల్లారెడ్డి, భద్రారెడ్డి భేటీ

## -రాజకీయంగా కలకలం.. కాంగ్రెస్ లో చేరేందుకేనా!

హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): కర్నాటక కాంగ్రెస్ నేత డికె శివ కుమార్‌తో మల్లారెడ్డి, భద్రారెడ్డి భేటీ ఆసక్తిగా మారింది. బెంగళూరులో డికెను మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి కలిశారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా మల్లారెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరితే మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ తన కుమారుడికి ఇవ్వాల్సిందిగా కోరుతున్నట్టు సమాచారం. బిఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు మల్లారెడ్డి కుమారుడికి ఆ పార్టీ అధినేత కెసిఆర్ ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఐనా తండ్రీ కుమారులు కాంగ్రెస్ అగ్రనేత డికె శివ కుమార్‌ను కలవడం రాజకీయంగా కలకలం సృష్టిస్తోంది.

# లక్షమంది వెనుకబడినవర్గాల పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు

న్యూఢిల్లీ, మార్చి 14:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ వెనుకబడిన వర్గాలకు రుణసాయం దిశగా నిర్వహించిన దేశవ్యాప్త విస్తృత ప్రచార కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా ప్రసంగించారు. అంతకుముందు "ప్రధానమంత్రి సామాజిక కోత్థాన–ఉపాధి ఆధారిత జనసంక్షేమ (పిఎం–సూరజ్) పథకం జాతీయ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే దేశంలోని లక్షమంది బలహీనవర్గాల పారిశ్రామికవేత్తలకు రుణ సహాయం మంజూరు చేశారు. అదే సమయంలో షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, పారిశుధ్య కార్మికులు సహా వెనుకబడిన వర్గాలకు చెందిన వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ప్రధాని సంభాషించారు.

ఈ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరవాసి, క్లౌడ్ కంప్యూటింగ్ కంపెనీ వ్యవస్థాపకుడైన శ్రీ నరేంద్ర సేన్ తన ప్రగతి పయనం గురించి ప్రధానమంత్రికి వివరించారు. తొలుత ఓ సైబర్ కేఫ్ నడిపిన తాను కోడింగ్ నేర్చుకుని, ప్రస్తుత కంపెనీ యజమానిగా ఎదిగానని ఆయన తెలిపారు. నేటి తన కృషిలో భాగంగా 'ఎంఎస్ఎంఇ'ల డిజిటలీకరణ ద్వారా సాధికారత సాధించాలని లక్ష్యనిర్దేశం చేసుకున్నట్లు చెప్పారు. మరొక నరేంద్రుడి కథను తెలుసుకోవాలని ఉందంటూ ప్రధాని ఉల్లాసంగా వ్యాఖ్యానించడంపై శ్రీ సేన్ స్పందించారు. తనది గ్రామీణ వ్యాపార కుటుంబ నేపథ్యమని, అయినప్పటికీ తాము ఇండోర్‌కు తరలివచ్చాకు సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకున్నానని వివరించారు. ఓసారి 'నాస్కామ్' కార్యక్రమం సందర్భంగా దేశంలో 'క్లౌడ్ గోడౌన్' అవసరాన్ని ప్రధాని ప్రస్తావించడంతో స్ఫూర్తి పొంది, 'క్లౌడ్ కంప్యూటింగ్'పై దృష్టి సారించానని వెల్లడించారు. ఆ విధంగా "ఓ గ్రామంలోని నరేంద్రుడు మరొక నరేంద్రుడి నుంచి ప్రేరణ పొందాడు" అని శ్రీ సేన్ చమత్కరించారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ– శ్రీ సేన్ ఎదుర్కొన్న సవాళ్లు, ప్రభుత్వం నుంచి అందిన చేయూత గురించి వాకబు చేశారు. అప్పట్లో ప్రభుత్వ సాయం కోసం తన అభ్యర్థనను సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఆమోదించినట్లు శ్రీ సేన్ బదులిచ్చారు. దీంతో భారత తొలి డేటా సెంటర్ పార్క్ ఏర్పాటుకు మార్గం సుగమమైందని వివరించారు. శ్రీ సేన్ చొరవను ప్రధాని అభినందిస్తూ– అంకుర సంస్థల స్థాపనపై యువత ఆసక్తి కనబరచడాన్ని హర్షణీయమంటూ వారి చొరవను ప్రశంసించారు. ఈ క్రమంలో శ్రీ సేన్ విజయం సాధించారంటూ ఆయనను అభినందించారు.

జమ్మూలో బొటిక్ నిర్వాహకురాలు నీలం కుమారి మాట్లాడుతూ– మహమ్మారి సమయంలో దిగ్బంధం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొన్నానని ప్రధానికి తెలిపారు. అయితే, ఆ తర్వాత ఉజ్వల, పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్ వంటి వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎంతో ప్రయోజనం పొందానని ఆనందం వెలిబుచ్చారు. అలాగే వ్యాపారం ప్రారంభించేందుకు ప్రభుత్వం నుంచి రుణం కూడా లభించిందని, తాను మరికొందరికి ఉపాధి కూడా కల్పించానని తెలిపారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ– స్వయం ఉపాధి పొందడమేగాక మరికొందరికి జీవనోపాధి కల్పిస్తున్న వ్యక్తిగా ఆమెను ప్రశంసించారు. దేశంలో నలుమూలలా లోగడ నిర్లక్ష్యానికి గురైన ప్రజలంతా నేడు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని ప్రధానమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. తన స్ఫూర్తిదాయక కథనాన్ని పంచుకోవడంపై ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో వెనుకబడిన వర్గాల జీవితాలను జన్–ధన్, ముద్ర, పీఎం ఆవాస్, వ్యవస్థాపన అభివృద్ధి పథకం వంటివి ఎందరో వెనుకబడిన వారి జీవితాలను మారుస్తున్నాయని పేర్కొన్నారు.

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ నుంచి 'జల్ జీవన్ ఆగ్రోటెక్' సహ వ్యవస్థాపకుడు శ్రీ నరేష్ వ్యవసాయ వ్యర్థ జలాల పరిరక్షణ కార్యకలాపాలు నిర్వహించే తన అంకుర సంస్థ గురించి ప్రధానికి వివరించారు. దీని స్థాపన కోసం 'అంబేద్కర్ సోషల్ ఇన్నోవేషన్ మిషన్' కింద రూ.30 లక్షల రుణం పొంది, యంత్రాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. దీనిపై ప్రధాని తోపాటు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగం నుంచి కంపెనీ వ్యవస్థాపకుడిగా ఎదిగిన ఆయన ప్రయాణం గురించి ప్రధానమంత్రి వాకబు చేశారు. తల్లిదండ్రులతో కలిసి పొలాల్లో పనిచేయడం ద్వారా దీనిపై తగిన అనుభవం పొందానని శ్రీ నరేష్ వెల్లడించారు. మరోవైపు ఆయుష్మాన్ భారత్ కార్డ్, రాష్ట్రీయ రేషన్ పథకం ప్రయోజనాలు పొందడం గురించి కూడా ఆయన ప్రధానికి తెలిపారు. తమ కంపెనీ ద్వారా రైతులను ఆదుకోవడంపై శ్రీ నరేష్ మాట్లాడుతూ– తాము స్వరూపమిచ్చి, తయారుచేసిన ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం నుంచి పేటెంట్ లభించిందన్నారు. వ్యవసాయ సమయంలో నీటి వృథా నిరోధంలో ఇది ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాల సద్వినియోగం దిశగా వ్యవసాయ రంగంలోని కొత్త పరిశ్రమలు ప్రయత్నించాలని ఆయన సూచించారు. ఆయన ఉత్సాహాన్ని ప్రధాని మోదీ మెచ్చుకుంటూ వ్యవసాయ రంగంలో చొరవ చూపడంలో యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారంటూ ప్రశంసించారు.

గుంటూరు నివాసి, పారిశుధ్య కార్మికురాలు శ్రీమతి ముత్తమ్మ మాట్లాడుతూ– తన పేరిట సెప్టిక్ ట్యాంక్ మడ్డి తొలగింపు వాహనం మంజూరు కావడం తన జీవితాన్నే మార్చేసిందని ప్రధానికి చెప్పారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన ఆమె "ఈ వాహనం నాకెంతో ఆత్మబలాన్నిచ్చింది.. సమాజం నన్నిపుడు గౌరవిస్తోంది.. మీ చలవతోనే ఇదంతా సాధ్యమైంది" అని ఆమె పేర్కొన్నారు. ఆమె కుటుంబం గురించి ప్రధానమంత్రి వాకబు చేయగా– తన పిల్లలు చదువుకుంటున్నారని, తాను డ్రైవింగ్ నేర్చుకోవడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తాను, తన కుటుంబం లబ్ధి పొందుతున్నట్లు పేర్కొంటూ, ప్రధానమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనకెంతో ఇష్టమైన పరిశుభ్రత రంగంలో ముందడుగు వేయడంపై ప్రధాని ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. పౌరుల జీవితాల్లో సానుకూల మార్పు దిశగా ప్రభుత్వం గత 10 సంవత్సరాల నుంచి నిర్విరామ కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా "మహిళల ఆత్మగౌరవం, శ్రేయస్సు మా సంకల్పంలో కీలకాంశాలు" అని ప్రధాని వ్యాఖ్యానించారు.

లబ్ధిదారులతో ముచ్చటించిన అనంతరం ప్రధానమంత్రి ప్రసంగిస్తూ– దేశంలోని 470 జిల్లాల నుంచి దాదాపు 3 లక్షలమంది ఆన్ లైన్ మాధ్యమంద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనడంపై కృతజ్ఞతలు తెలిపారు. దళితులు, వెనుకబడిన, అణగారిన వర్గాల సంక్షేమాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమాన్ని దేశమంతా ప్రత్యక్షంగా చూస్తున్నదని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యంపై ప్రభుత్వ నిబద్ధతకు నేటి సందర్భం ఒక నిదర్శనమన్నారు. ఇందులో భాగంగా దేశంలోని 500 జిల్లాలకు చెందిన లక్ష మంది వెనుకబడిన వర్గాల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.720 కోట్ల విలువైన ఆర్థిక సహాయం బదిలీ చేసినట్లు ఆయన గుర్తుచేశారు. "గత ప్రభుత్వాల హయాంలో ఇటువంటి ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి) వ్యవస్థ ఊహల్లోనైనా లేనిది" అన్నారు. ఇతర ప్రభుత్వ పథకాల 'డిబిటి' తరహాలోనే దళారులు, కమిషన్లు, సిఫారసులకు అతీతంగా సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సహాయం అందించే 'సూరజ్' పోర్టల్ ప్రారంభించడాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంక్ పరిశుభ్రం చేసే కార్యకలాపాల్లో గల సఫాయి మిత్రలకు ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీపీఈ కిట్‌ల పంపిణీ గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. అణగారిన వర్గాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమంలో సేవా కార్యక్రమాల విస్తరణ ఒక భాగమంటూ– ఈ పథకాలతో లబ్ధి పొందుతున్న వారిని ఆయన అభినందించారు.

లబ్ధిదారులతో తన సంభాషణను ప్రస్తావిస్తూ– దళిత, అణగారిన, వెనుకబడిన వర్గాలకు లబ్ధి చేకూరడం తనకెంత సంతృప్తినిస్తున్నదో ప్రధాని వివరించారు. వారికి. తనకు వ్యత్యాసమేమీ లేదని, వారిని తన కుటుంబంగా భావిస్తున్నందున అణగారిన వర్గాలకు లబ్ధి చేకూరడం తనకు ఉద్వేగం కలిగిస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మన దేశం 2047నాటికి వికసిత భారత్ కావాలన్న లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ– అణగారిన వర్గాలు ముందంజ వేస్తే తప్ప స్వప్నం సాకారం కాబోదని ప్రధాని స్పష్టం చేశారు. గతకాలపు ఆలోచన ధోరణిని ఛేదించడంద్వారా దళితులు, వెనుకబడిన, అణగారిన, గిరిజన వర్గాలకు గ్యాస్ కనెక్షన్, బ్యాంకు ఖాతాలు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు అందేలా చూస్తున్నామని తెలిపారు.

కనీస సౌకర్యాల కల్పనలోనూ తరతరాలుగా వెనుకబడిన వర్గాలు నిర్లక్ష్యానికి గురవుతూ వచ్చాయని ప్రధాని గుర్తుచేశారు. అయితే, "అన్నివిధాలా నిరాశనిస్పృహల్లో కూరుకుపోయిన వారికి ప్రభుత్వం చేరువైంది. అంతేకాదు... దేశ ప్రగతిలో వారిని భాగస్వాములను చేసింది" అని వ్యాఖ్యానించారు. ఉచిత రేషన్/వైద్యం, పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ తదితర పథకాలతో అత్యధికంగా లబ్ధి పొందుతున్నది అణగారిన వర్గాల వారేనని చెప్పారు. ఈ నేపథ్యంలో "ఈ పథకాలను మేం సంతృప్త స్థాయికి చేర్చే లక్ష్యం దిశగా కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. సంచార, సంచార వర్గాలకోసం ప్రవేశపెట్టిన పథకాలతోపాటు పారిశుధ్య కార్మికుల కోసం 'నమస్తే' వంటి పథకాలను తెచ్చినట్లు ప్రధాని గుర్తుచేశారు. మరుగుదొడ్లను శుభ్రం చేయడంలో మానవ వినియోగం అమానవీయమని ప్రధాని అన్నారు. ఈ పద్ధతిని నిర్మూలిస్తూ 60,000 మందికి ఆర్థిక సహాయం అందించి, వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చేశామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి తన ప్రసంగం కొనసాగిస్తూ "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల సాధికారత కల్పనకు ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోంది" అన్నారు. ఈ మేరకు గత 10 సంవత్సరాల్లో వివిధ సంస్థల ద్వారా వారికి అందించే సహాయం రెట్టింపు చేశామని తెలిపారు. ఎస్సీల సంక్షేమం కోసం ఈ ఏడాది ప్రభుత్వం దాదాపు రూ.1.60 లక్షల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. గత ప్రభుత్వాల పాలన కాలమంతా రూ.లక్షల కోట్ల కుంభకోణాలతో ముడిపడినది కాగా, నేడు ఈ సొమ్మునంతా దళిత, అణగారిన వర్గాల సంక్షేమంతోపాటు దేశాభివృద్ధి కోసం వెచ్చిస్తున్నామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ యువతకు ఉపకారవేతనాల పెంపు, వైద్యవిద్య సీట్ల అఖిలభారత కోటాలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్, 'నీట్'లో ఓబీసీ విద్యార్థులకు ప్రవేశం, అణగారిన వర్గాల విద్యార్థులకు జాతీయ విదేశీ విద్యాభ్యాస ఉపకారవేతనం మంజూరు వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. విదేశాలలో మాస్టర్స్, పిహెచ్.డి., అభ్యసించడానికి, శాస్త్రవిజ్ఞాన సబ్జెక్టులలో పీహెచ్.డి., చేయడానికి వీలుగా జాతీయ పరిశోధక విద్యార్థి ఉపకారవేతనం కూడా పెంచామని ఆయన తెలిపారు. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా ప్రకటించడంపై ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితానికి సంబంధించిన పంచ తీర్థాలను అభివృద్ధి చేయడాన్ని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

అలాగే "ప్రభుత్వం అణగారిన వర్గాల యువత ఉపాధి–స్వయం ఉపాధికీ ప్రాధాన్యమిస్తోంది" అని వివరిస్తూ– ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు సహా పేదలకు దాదాపు రూ.30 లక్షల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించిన ముద్ర యోజన గురించి ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో వ్యవస్థాపకతకు ప్రోత్సాహమిస్తూ 'స్టాండప్ ఇండియా', 'వెంచర్ క్యాపిటల్ ఫండ్' పథకాలను ప్రవేశపెట్టామని ఆయన గుర్తుచేశారు. "దళితులలో వ్యవస్థాపకత ప్రాధాన్యం దృష్ట్యా మా ప్రభుత్వం 'అంబేద్కర్ సోషల్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ మిషన్'ను కూడా ప్రారంభించింది" అని ప్రధాని మోదీ తెలిపారు. దళితులు, అణగారిన వర్గాల ప్రయోజనాలకు ఉద్దేశించిన విధానాలను ప్రస్తావిస్తూ– "అణగారినవర్గాల ప్రగతి, గౌరవాలపై మా నిబద్ధతకు ఇవన్నీ నిదర్శనాలు. ఈ కార్యక్రమం రాబోయే ఐదేళ్లలో మరింత విస్తరిస్తుంది... ఇది మోదీ మీకిస్తున్న హామీ. మీ అందరి ప్రగతితోనే వికసిత భారత్ స్వప్న సాకారం సాధ్యం" అని స్పష్టం చేస్తూ ప్రధాని తన ప్రసంగం ముగించారు.వెనుకబడిన వర్గాలకు రుణమద్దతు దిశగా ఏర్పాటు చేస్తున్న పిఎం– సూరజ్ పథకం జాతీయ పోర్టల్ అణగారినవర్గాలకు ప్రభుత్వ ప్రాధాన్యంపై ప్రధానమంత్రి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఇది సమాజంలోని అత్యంత అట్టడుగు వర్గాల సముద్ధరణ లక్ష్యంగా రూపొందించిన ఓ పరివర్తనాత్మక కార్యక్రమం బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సి–ఎంఎఫ్ఐ సహా ఇతరత్రా ఆర్థిక సహాయ సంస్థల ద్వారా దేశవ్యాప్తంగాగల అర్హులకు దీనికింద రుణ సహాయం అందించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 'నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్' (నమస్తే–ఔంటయాఇ) పథకం కింద సఫాయి మిత్రలకు (మురుగు–సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసే కార్మికులు) ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులతోపాటు పీపీఈ కిట్‌లను కూడా ప్రధానమంత్రి పంపిణీ చేశారు.

# కుల సర్వేకు ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలి

## -అఖిల పక్ష, కుల సంఘాల సదస్సు డిమాండ్
## -ఉత్తర్వుల దిశగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం: వకుళాభరణం
## -లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ ముందే "సర్వే"చేయాలి: ప్రొఫెసర్ కోదండరామ్



హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్రంలోని ప్రజలందరి వివరాలు కులాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం సేకరించబోయే సామాజిక, ఆర్థిక, కుల సర్వే కార్యాచరణకు వెంటనే ఉత్తర్వులను, మార్గ దర్శకాలతో ఇవ్వాలని అఖిల పక్ష, కుల సంఘాల సమావేశం కోరింది. లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ కు ముందే ఉత్తర్వులను విడుదల చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం నాడు నగరంలోని కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్ లో జాతీయ బీసీ దళ్, తెలంగాణ బీసీ జన జాగృతి సంయుక్తంగా అఖిల పక్ష కుల సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించింది. సమావేశానికి ఆచార్య ఎం. భాగయ్య సభాధ్యక్షులుగా వ్యవహరించారు. సమన్వయకర్తలుగా జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి, తెలంగాణ బీసీ జన జాగృతి అధ్యక్షులు కె. పి. మురళి కృష్ణ వ్యవహరించారు.

కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షులు ఎమ్. కోదండరామ్, రిటైర్డ్ ఎఐఎ అధికారి, సామాజిక ఉద్యమకారుడు ఆకునూరి మురళి, సామాజికవేత్తలు ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ సుదర్శన్ రావు, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్ వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు, వైద్యులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద యెత్తున పాల్గొన్నారు.

సమావేశంలో ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ... కుల సర్వేకు ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలన్న డిమాండ్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు, ముఖ్యమంత్రి తో మాట్లాడి ఈ డిమాండ్లను నెరవేర్చే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ... బీసీ కమిషన్ గా తమ వంతు కృషిని చేస్తూనే ఉన్నామని అన్నారు . ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం, ఉత్తర్వులు ఇవ్వడంలో వెనకడుగు వేయబోదని ఆయన పేర్కొన్నారు.

జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమార స్వామి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం "కుల సర్వే" తీర్మానంతో బలహీన వర్గాలలో గొప్ప మద్దతును కూడగట్టుకుందని అన్నారు. సర్వే కు వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో సుమారు 70 సంఘాలకు చెందిన కుల, ఉద్యోగ, మహిళ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

## 72 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల

### -ఇందులో తెలంగాణ నుంచి ఆరుగురికి చోటు
### -మెదక్ ఎం రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ డీకే అరుణ

హైదరాబాద్ మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);లోక్‌సభ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ బుధవారం రెండో విడత అభ్యర్థులను ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో 195 మందితో తొలి జాబితాను విడుదల చేసింది. తెలంగాణ నుంచి తొమ్మిది మంది అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. తాజాగా 72 మంది అభ్యర్థులతో రెండో జాబితాను విడుదల చేయగా.. ఇందులో తెలంగాణ నుంచి ఆరుగురికి చోటు దక్కింది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి గోడెం నగేశ్, పెద్దపల్లి గోమాస శ్రీనివాస్, మెదక్ ఎం రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ డీకే అరుణ, నల్గొండ సైదిరెడ్డి, మహబూబాబాద్ అజ్మీరా సీతారాం నాయక్ అభ్యర్థులుగా ప్రకటించింది. తెలంగాణలో ఇప్పటికే 9 మంది అభ్యర్థులను ప్రకటించగా.. నిజామాబాద్ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్, కరీంనగర్ బండి సంజయ్, భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్, మల్కాజిగిరి ఈటల రాజేందర్, సికింద్రాబాద్ కిషన్ రెడ్డి, హైదరాబాద్ నుంచి మాధవి లతను అభ్యర్థులుగా బరిలో దింపింది. తెలంగాణలో 17 స్థానాలుండగా ఇప్పటి వరకు 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్, ఖమ్మం స్థానాల అభ్యర్థుల పేర్లు పెండింగ్‌లో పెట్టింది.

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేసిన ఏపీ హైకోర్టు

అమరావతి మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);2018లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఏపీ హైకోర్టు రద్దు చేసింది. 2018లో ఏపీపీఎస్సీ ఈ పరీక్ష నిర్వహించగా.. తాజాగా ఈ పరీక్షను హైకోర్టు రద్దుచేసింది. మరోసారి ఈ పరీక్షను నిర్వహించాలని ఆదేశించింది. మెయిన్స్ జవాబు పత్రాలను పలుసార్లు వాల్యుయేషన్ చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా మెయిన్స్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసిన న్యాయస్థానం.. మళ్లీ పరీక్ష నిర్వహణ, ఎంపిక 6 వారాల్లో పూర్తి చేయాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది.

## "రాహుల్ గాంధీ జోడో యాత్ర - భారత దేశం పై దాని ప్రభావం పై వ్యాస రచన పోటీలు

హైదరాబాద్ మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గత సంవత్సరం నుండి దేశం లో వివిధ రాష్ట్రాల లో జరుగుతున్న "రాహుల్ గాంధీ జోడో యాత్ర - భారత దేశం పై దాని ప్రభావం "అనే శీర్షిక పై ఉభయ తెలుగు రాష్ట్రాల ఉన్నత పాఠశాల విద్యార్థుల కు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని ఆళ్ళ రామకృష్ణ ఒక ప్రకటన లో తెలిపారు. వ్యాసాలు 2000 పదాలు మించకుండా ( తెలుగు లేక ఇంగ్లీషు భాషల్లో ) 9966944233 నెంబర్ కు వాట్స్‌ప్‌లో కాని లేదా ఆళ్ల రామకృష్ణ , విల్లా నెంబర్ 42 ,సైబర్ మెడోస్ సొసైటీ ,కొండాపూర్ హైదరాబాద్ 84 అనీ చిరునామాకు కాని ఈ క్రింద చిరునామా కు ఈనెల మార్చి 31 లోపు పంప గలరని తెలిపారు.

# పాకిస్థాన్ లో గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక సంక్షోభం

## -ఈ పదవీ కాలంలో జీతం తీసుకోకూడదని ఆ దేశ అధ్యక్షుడు జర్దారీ నిర్ణయం

న్యూ ఢిల్లీ మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పొరుగు దేశం పాకిస్థాన్ గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఓ త్యాగానికి సిద్ధపడ్డారు. ఈ పదవీ కాలంలో జీతం తీసుకోకూడదని నిర్ణయించారు. ఈ మేరకు ఆ దేశ అధ్యక్ష కార్యాలయం ఎక్స్ వేదికగా ప్రకటించింది. 'దేశానికి సహాయం చేయడానికి అధ్యక్షుడు జర్దారీ తన పదవీ కాలంలో ఎలాంటి జీతం తీసుకోరు. ఆర్థిక నిర్వహణ, జాతీయ ఆదాయంపై తన జీతం భారం పడకూడదన్న ఉద్దేశంతోనే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. తన వేతనాన్ని వదులుకున్నారు' అని తెలిపింది. అదేవిధంగా పాక్ ఇంటీరియర్ మంత్రి మొహసిన్ నక్వీ కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారు. ఈ సారి పదవీకాలంలో జీతాన్ని తీసుకోకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇది సవాళ్లతో కూడిన సమయమని, వీలైనన్ని మార్గాల్లో దేశానికి అండగా ఉండి సేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తన జీతాన్ని వదులుకుంటున్నట్లు వెల్లడించారు. పాకిస్థాన్ 14వ అధ్యక్షుడి గా పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ సహ చైర్మన్ అసిఫ్ అలీ జర్దారీ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. శనివారం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో జర్దారీ విజయం సాధించారు. పీపీపీ, పీఎంఎల్-ఎన్ మద్దతుతో పోటీ చేసిన ఆయన సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్ అభ్యర్థి మహమూద్ ఖాన్ అచక్‌జాయ్ (75)ను ఓడించారు. ఈ ఎన్నికల్లో జర్దారీకి 255 ఓట్లు, మహమూద్‌కు 119 ఓట్లు లభించాయి. దీంతో తదుపరి పాక్ అధ్యక్షుడిగా జర్దారీ బాధ్యతలు చేపట్టారు. ఇస్లామాబాద్ లోని అధ్యక్ష భవనంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన దేశాధ్యక్ష పదవిని చేపట్టారు.

# తొలి మొదటి కవయిత్రి మొల్లకు బీసీ యువజన సంఘం ఘన నివాళ్లు

## మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా నిర్వహించాలి : రావులకోల్ నరేష్



హైదరాబాద్ మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); తొలి మొదటి తెలుగు కవయిత్రి అటుకూరి మొల్లమాంబా 583 వ జయంతి సందర్భంగా టాంక్ బండ్ లోని తన విగ్రహానికి బీసీ యువజన సంఘం ఆధ్వర్యం లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు రావులకోల్ నరేష్ ప్రజాపతి మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగులో రచించినటువంటి మొల్ల జయంతి వేడుకలను ప్రభుత్వం రవీంద్రభారతిలో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి : విక్రమ్ గౌడ్

బీసీ విద్యార్థి సంఘము జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార ఏర్పాటు చేసిందో అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.రాష్ట్రం లో ఉన్న 15 లక్షల కుమ్మరిలు ఇప్పటి వరకు ఒక్కరూ కూడా అసెంబ్లీ లో అడుగు పెట్టలేదని రాజకీయంగా కూడా జనాభా దామాషా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించాలని అన్ని పార్టీలు కుమారులకు 1 సిటు కేటాయించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో బడే సాబ్ వెంకటేష్ ముదిరాజ్,ఇంద్రమ్ ,మనీష్ వివిధ కుల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఆస్పత్రికి వచ్చి కేర్ టేకర్ ను చూసి కన్నీరు పెట్టుకున్న ఏనుగు!



హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జంతువులకూ మనసు ఉంటుంది. కరుణ, ఆపేక్ష ఉంటాయి. ఈ విషయం ఎన్నోసార్లు రుజువైంది కూడా. కొన్నాళ్లు పోషించిన తర్వాత వాటిని అడవిలో వదిలేసినా, మళ్లీ కనబడితే చాలు అక్కున చేర్చుకుంటాయి. పెద్ద పులులు, సింహాల వంటి క్రూర జంతువులు కూడా ఇందుకు మినహాయింపు కాదు. తాజాగా ఇలాంటి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఓ ఏనుగు ఎన్నో ఏళ్లపాటు ఓ కేర్ టేకర్ సంరక్షణలో ఉంది. అయితే అతను అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయ్యాడు. కేర్ టేకర్ కనిపించకపోవడంతో ఏనుగు చాలా దిగులు పడింది. అతనికి ఒంట్లో బాగోలేదన్న సంగతిని ఇతర కేర్ టేకర్ల ద్వారా తెలుసుకున్న ఏనుగు, అతన్ని చూసేందుకు ఏకంగా ఆస్పత్రికి వచ్చింది. తన కేర్ టేకర్ చికిత్స పొందుతున్న గది గుమ్మం ఎత్తు తక్కువగా ఉండటంతో మోకాళ్లపై వంగి లోపలికి వచ్చిన ఏనుగు, అవసాన దశలో ఉన్న కేర్ టేకర్ ను చూసి కన్నీరు పెట్టుకుంది. తొండంతో అతన్ని తట్టి లేపేందుకు ప్రయత్నించింది. అనారోగ్యం కారణంగా కేర్ టేకర్ పైకి లేవలేకపోయాడు. ఇది గమనించిన అతని సహాయకురాలు, అతని చేతిని పైకెత్తి ఏనుగు తొండానికి తాకించింది. ఈ వీడియో చూసిన ఎంతోమంది ఏనుగు దయార్ద్రహృదయానికి జోహర్లు అర్పించారు.

# రక్తదానం ఒక పవిత్ర కార్యం -డాక్టర్ నిఖిల్ తాడికొండ

హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అత్యవసర పరిస్థితుల్లో మరొకరి ప్రాణం పోసేది రక్తదానం అని, దీనిని కృత్రిమంగా ఉత్పత్తి చేయడం సాధ్యపడదు అని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ నిఖిల్ తాడికొండ అన్నారు. సాయి నగర్ లో మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల్ తాడికొండ మాట్లాడుతూ రక్తదానం ఒక పవిత్ర కార్యనీ అని, పోయిన ప్రాణాలను మనము ఎలాగో తీసుకురాలేము అని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడే ప్రాణాలను ఒక్కోసారి సాటి మనిషి రక్తముతో కాపాడగలము అని ఇది రక్త దానము తోనే సాధ్యం అని స్వచ్ఛంద రక్తదాతలను కోరారు.

# బెంగళూరు నగరం లో మరింత తీవ్రమైన నీటి సంక్షోభం

## -వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోతున్న బోర్లు
## -నీటి కొరత వల్ల పాఠశాలలను మూసివేసే పరిస్థితులు

బెంగళూరు మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కర్ణాటక రాజధాని బెంగళూరు నగరం లో నీటి సంక్షోభం మరింత తీవ్రమైంది. తాగు నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగానే బోర్లు ఎండిపోవడంతో నగరంలో ఈ పరిస్థితి నెలకొంది. స్కూళ్లలో విద్యార్థులకు తాగడానికి కూడా నీరు దొరకని దుస్థితి ఏర్పడిందంటే నగరంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నీటి కొరత వల్ల పాఠశాలలను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలలు ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. అటు నగర జలమండలి కూడా సరిపడా నీటిని సరఫరా చేయడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. దీంతో డిమాండ్ ఎక్కువవడంతో ట్యాంకర్ల ధరలు అమాంతం పెంచేశారు. నగరంలో రోజుకు 2,600-2,800 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉంటే ఇప్పుడు దాదాపుగా 1,300 ఎంఎల్‌డీ నీరు మాత్రమే సరఫరా అవుతోంది. అంటే, అవసరమైన నీటిలో సగం కూడా సరఫరా జరగడం లేదు. మరోవైపు ఎండాకాలం ఇంకా పూర్తిగా ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోవు రోజుల్లో పరిస్థితి ఇంకా ఎంత స్థాయికి దిగజారుతుందోనని నగరవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

### నెలకు ఐదు సార్లే స్నానం..

ప్రతి నీటి బొట్టును వృథాగా పోకుండా జాగ్రత్తగా వాడుకుంటున్నారు. ఎండాకాలం అయినప్పటికీ నెలకు ఐదు సార్లు మాత్రమే స్నానాలు చేస్తున్నామని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో వంట వండటం, గిన్నెలు తోమడం వంటి వాటికి నీరు ఎక్కువగా అవసరం ఉండటంతో.. ఫుడ్‌ను బయట నుంచి ఆర్డర్ పెట్టుకుంటున్నట్లు చెబుతున్నారు. నివాసితులు ఎక్కువగా ఉన్న కమ్యూనిటీల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. రోజుకు నాలుగు నుంచి ఐదు ట్యాంకులు అవసరం ఉండగా.. ఒకటి లేదా రెండు ట్యాంకులు మాత్రమే సరఫరా అవుతున్నాయి. దీంతో గత మూడు నెలలుగా తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు కమ్యూనిటీల్లో నివసించే ప్రజలు వాపోతున్నారు.

### వర్షాలు పడితేనే సాధారణ స్థితికి..

మళ్లీ వర్షాలు పడితే తప్ప పరిస్థితి మామూలు స్థితికి వచ్చేలా కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో పాలకులపై ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. వరుసగా అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న తీరులోనే సమస్యలు ఉన్నాయని అంటున్నారు. ఏ ప్రభుత్వ మూ కూడా ప్రజల శ్రేయస్సును పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లు, రోడ్లను నిర్మించడంపైనే దృష్టి పెడుతున్నారని, భూగర్భజలాలపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. అలా చేసి ఉంటే ఇప్పుడు ఇలాంటి పరిస్థితులు వచ్చేవి కావని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### పాలకులపై ప్రజల మండిపాటు..

ఇదిలా ఉండగా.. నగరంలో తీవ్రమైన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని అవసరాల మేరకు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. తాగునీటిని వాహనాలను తుడిచేందుకు, నిర్మాణం, వినోద కార్యకలాపాల్లో వాడొద్దని, అదేవిధంగా సినిమా హాళ్లు, మాల్స్‌లో తాగునీటి అవసరాల మినహా ఇతరత్రా కోసం వినియోగించవద్దని స్పష్టం చేసింది. ఉల్లంఘనకు పాల్పడిన వారిపై మొదటగా రూ.5 వేలు జరిమానా పడుతుందని, పదేపదే నీటి వృథాతో ఉల్లంఘనకు పాల్పడితే అదనంగా ప్రతిసారి రూ.500 చొప్పున ఫైన్‌గా చెల్లించాల్సి ఉంటుందని బెంగళూరు జలమండలి హెచ్చరించింది.

# 9-18 సంవత్సరాల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే లక్ష్యంతో 'కీర్తి' కార్యక్రమం ప్రారంభం




న్యూఢిల్లీ, మార్చి 14:భారత దేశం 2036 నాటికి టాప్-10 క్రీడాదేశంగా, 2047 నాటికి టాప్-5 దేశంగా అవతరించడంలో 'ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్' (కీర్తి) కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర యువజన వ్యవహారాలు ఉ క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ చెప్పారు. మంగళవారం, చండీగఢ్‌లోని సెక్టార్ 7 స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 'కీర్తి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 9-18 సంవత్సరాల మధ్య వయస్సున్న పాఠశాల విద్యార్థుల కోసం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి రెండు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. 1. దేశంలోని ప్రతి మూల నుంచి ప్రతిభను వెలికితీయడం, 2. మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్ల వంటి వ్యసనాలను అరికట్టడానికి క్రీడలను సాధనంగా ఉపయోగించడం.

దేశంలో క్రీడల సంస్కృతిని నిర్మించడం, ఒలింపిక్స్ ఉ ఆసియా క్రీడలు వంటి ప్రపంచ స్థాయి పోటీల్లో భారతదేశానికి పతకాలు సాధించగల ప్రతిభను సృష్టించడం కోసం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్ష 'కీర్తి' కార్యక్రమం అని శ్రీ ఠాకూర్ ఉద్ఘాటించారు.

'కీర్తి' కార్యక్రమం దేశంలోని 50 కేంద్రాల్లో ఘనంగా ప్రారంభమైంది. మొదటి దశలో అథ్లెటిక్స్, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీ, ఫుట్‌బాల్ సహా 10 క్రీడల్లో 50 వేల మంది దరఖాస్తుదార్లను వడపోశారు. 'నోటిఫైడ్ టాలెంట్ అసెస్‌మెంట్ సెంటర్'ల ద్వారా ప్రతిభను గుర్తించేందుకు దేశవ్యాప్తంగా ఏడాదిలో 20 లక్షల మూల్యాంకనాలు నిర్వహించాలన్నది 'కీర్తి' లక్ష్యం.

"ఈ స్థాయి శిక్షణ కార్యక్రమం భారతదేశంలో మొదటిది. మన దేశం 2036 నాటికి ప్రపంచంలోని టాప్ 10 క్రీడా దేశంగా, 2047 నాటికి టాప్ 5 దేశాల్లో ఒకటిగా ఎదగాలనుకుంటున్న తరుణంలో ఈ కార్యక్రమం జీవం పోసుకుంది" అని శ్రీ ఠాకూర్ అన్నారు.

యువత దేశ నిర్మాతలు అని చెప్పిన శ్రీ ఠాకూర్, క్రీడల్లో ఫలితాలను సాధించాలంటే చిన్న వయస్సు నుంచే సాధన ప్రారంభించాలన్నారు. ఒక అథ్లెట్‌కు ఒలింపిక్ పతకాన్ని గెలవడానికి కనీసం 10 సంవత్సరాల సన్నద్ధత అవసరమని చెబుతూ, "దేశంలోని ప్రతి మూలను చేరుకోవాలని, క్రీడల్లో రాణించడానికి ఏం చేయాలో తెలీని ప్రతి చిన్నారితో అనుసంధానం కావాలని 'కీర్తి' కోరుకుంటోంది. ఆట ఆడే ప్రతి ఒక్కరు పతకం గెలవలేరని మాకు తెలుసు. కానీ, యువతను మత్తు పదార్థాలు డ్రగ్స్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు క్రీడలను ఉపయోగించాలని కోరుకుంటున్నాం. ప్రతి చిన్నారి మైభారత్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. మేం వారి వద్దకు వెళ్లి 'కీర్తి' ద్వారా అవకాశం కల్పిస్తాం" అని శ్రీ ఠాకూర్ చెప్పారు.

సమాచార సాంకేతికత ఆధారంగా, పారదర్శక పద్ధతిలో 'కీర్తి' కోసం ఎంపిక జరుగుతుంది. ఔత్సాహిక క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని అంచనా వేయడానికి కృత్రిమ మేధ ఆధారంగా డేటా అనలిటిక్స్‌ను ఉపయోగిస్తారు. ఈ స్థాయి నైపుణ్యాన్వేషణ వ్యవస్థకు జాతీయ క్రీడా సమాఖ్యలు, రాష్ట్ర ప్రభుత్వాల వ్యూహాత్మక సహకారం అవసరమని శ్రీ ఠాకూర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మౌలిక సదుపాయాల కోసం రూ.3000 కోట్లు ఖర్చు చేసిందని, దేశవ్యాప్తంగా 1000కి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు.

చండీగఢ్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కిరణ్ ఖేర్, చండీగఢ్ రాష్ట్ర అధికారులు, ప్రముఖ క్రీడాకారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.'కీర్తి' కార్యక్రమాన్ని శ్రీమతి ఖేర్ ప్రశంసించారు. కపిల్ దేవ్, యువరాజ్ సింగ్, అభినవ్ బింద్రా వంటి ప్రముఖ క్రీడాకారులను చండీగఢ్ అందించిందని, ఈ పథకం ఆటగాళ్లకు అతి పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు.

"తమ బిడ్డ జీవితంలో ఏదైనా సాధించాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారు. కానీ, చాలాసార్లు కలలు-వాస్తవాలు వేర్వేరుగా ఉంటాయి. కనీసం క్రీడల్లోనైనా ఆ అంతరాన్ని తగ్గించడానికి 'కీర్తి' సాయం చేస్తుంది. ఆడాలని, క్రీడల్లో రాణించాలని కోరుకునే ప్రతి బిడ్డకు ఇప్పుడు ఒక మార్గం ఉంది" అని శ్రీమతి ఖేర్ చెప్పారు.

చండీగఢ్‌లోని సెక్టార్ 7 స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎంపిక ప్రక్రియ కోసం చాలా మంది బాలబాలికలు తరలివచ్చారు.

ఆసియా క్రీడలు, గత సంవత్సరం బుడాపెస్ట్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో నీరజ్ చోప్రాకు గట్టి పోటీ ఇచ్చిన జెనాను శ్రీ ఠాకూర్ సన్మానించారు.

2030లో యూత్ ఒలింపిక్స్, 2036లో సమ్మర్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్న భారత దేశ ఉద్దేశాన్ని శ్రీ ఠాకూర్ మరోసారి వెల్లడించారు.

"మనం ప్రపంచ శక్తిగా మారాలంటే క్రీడాశక్తిని ప్రదర్శించాలి, ఉపయోగించుకోవాలి. సంగీతం, చలనచిత్రాలు, క్రీడలు వంటివాటిలో మనం సమర్థులం. నైపుణ్యాన్ని మరింత సానబెట్టడంలో 'కీర్తి' సాయపడుతుంది. ప్రభుత్వం వైపు నుంచి అన్ని సహాయసహకారాలను అందించవలసి ఉంటుంది, అది ప్రధానం" అని కేంద్ర మంత్రి చెప్పారు.

కేంద్ర యువజన వ్యవహారాలు ఉ క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రాధాన్యత పథకాల్లో 'ఖేలో ఇండియా మిషన్' ఒకటి. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనల్లోంచి ఈ కార్యక్రమం ఉద్భవించింది. 'ఖేలో ఇండియా మిషన్' దేశంలో క్రీడల సంస్కృతిని పెంచడం, క్రీడా నైపుణ్యాన్ని సాధించడం ఈ కార్యక్రమం లక్ష్యం. 'ఖేలో ఇండియా మిషన్'లోని "క్రీడల పోటీలు ఉ నైపుణ్యాభివృద్ధి" విభాగం కింద, దేశంలోని క్రీడల వ్యవస్థను అభివృద్ధి చేయడానికి, అట్టడుగు స్థాయి ఉ ఉన్నత స్థాయి అథ్లెట్ల గుర్తింపునకు, ప్రతిభను పెంచడానికి "టాలెంట్ ఐడెంటిఫికేషన్ అండ్ డెవలప్‌మెంట్" పని చేస్తుంది.

# ఉక్రెయిన్‌కు మద్దతుగా అమెరికా సైన్యాన్ని పంపితే అణుయుద్ధం తప్పదు

## -పశ్చిమ దేశాలను హెచ్చరించిన రష్యా అధ్యక్షుడు పుతిన్

మాస్కో మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉక్రెయిన్‌కు మద్దతుగా అమెరికా సైన్యాన్ని పంపితే అణుయుద్ధం తప్పదని రష్యా అధ్యక్షుడు పుతిన్ పశ్చిమ దేశాలను హెచ్చరించారు. మార్చి 1517 మధ్య రష్యా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. అకారణంగా ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలు ఉపయోగించాల్సిన అవసరం రష్యాకు లేదని స్పష్టం చేశారు. " సాంకేతికంగా అణు యుద్ధానికి రష్యా సిద్ధంగా ఉంది. కానీ అందుకు తొందరపడడం లేదు. మాకు కొన్ని విధి విధానాలున్నాయి. ఈ విషయం అమెరికాకు తెలుసు. ఒక వేళ ఉక్రెయిన్‌కు మద్దతుగా సైన్యాన్ని పంపితే యుద్ధంలో ఆ దేశం నేరుగా జోక్యం చేసుకున్నట్టే. దానికి తప్పకుండా బదులిస్తాం. రష్యాఅమెరికా మధ్య సంబంధాలను వ్యూహాత్మక చర్చలు జరిపేందుకు చాలా మంది నిపుణులు ఉన్నారు' అని పుతిన్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు రష్యా సుముఖంగా ఉందని ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు. అయితే ఆ చర్చలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా జరగాలన్నారు. ఒకవేళ అమెరికా అణు పరీక్షలు చేపడితే , రష్యా కూడా వాటిని పరీక్షిస్తుందని పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తరువాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో పుతిన్ విజయంపై ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు ఆసక్తిగా ఉన్నాయి.

# అప్పుల బాధతో దంపతుల ఆత్మా హత్య

నిజామాబాద్ మార్చ్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నిజామాబాద్ అప్పుల బాధతో ఆత్మా హత్య నిజామాబాద్ లో బుధవారం విషాదం చోటుచేసుకుంది. దంపతులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను స్వామి(45), దేవలక్ష్మి(40)గా గుర్తించారు. అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన కుమారుడికి తల్లిదండ్రులు విగతజీవులై కనిపించడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.


KAARTHIKA DEVELOPERS

శ్రీకార్తీక డెవలపర్స్ సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీ క్రోధి నామ సంవత్సర జాతీయ స్థాయి ఉగాది కవితలపోటీ ఫలితాలు

ప్రథమ బహుమతి:రూ॥2500/-నిశ్శబ్ద సౌందర్యం-పరిమి వెంకటసత్యమూర్తి
హైదరాబాద్-సెల్:9447203234,

ద్వితీయ బహుమతి:రూ॥2000/- మళ్ళీ వాడొకసారి నవ్వుతాడు-పొత్తూరి సీతారామరాజు
కాకినాడ-సెల్:9948849607,

తృతీయ బహుమతి రూ॥1500/- అల్ట్రామోడరన్-షేక్ కాశింబి
గుంటూరు-సెల్:9052216044,

రెండు ప్రత్యేక బహుమతులు: ఒక్కొక్కటి రూ॥1000/-
1) దయచేసి మా చీరల వెల అడక్కండి బి.కళాగోపాల్ నిజామాబాద్ సెల్:9441631029,
2) నవభారతంలో సామాన్యుడి జీవితం కోనేటి నరేష్ ఎబిపల్లి సెల్:8499847863.

బహుమతి ప్రదానోత్సవం ఏప్రియల్ 2024లో సాహితీకిరణం బ్రాంచి కార్యాలయం పొత్తూరులో నిర్వహించే 'ఉగాది సంబరాలు'లో జరుగుతుంది. విజేతలు తప్పక విచ్చేసి బహుమతి స్వీకరించవలసివుంది.


బహుమతి ప్రదాత
వి.వి.రాఘవరెడ్డి
సెల్:9866332738


డా॥పులివర్తి కృష్ణమూర్తి
కవి,రచయిత, విమర్శకులు
న్యాయనిర్ణేత
సెల్:9949092761


పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు

# సెప్టెంబరు 17న అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవం

## – హైదరాబాద్ విమోచన దినోత్సవంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

నెవ3 ఢిల్లీ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); హైదరాబాద్ విమోచన దినోత్సవంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబరు 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది."1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తర్వాత వరకు హైదరాబాద్ ప్రాంతం నిజాం పాలనలో ఉంది. ఆపరేషన్ పోలో పేరుతో నిర్వహించిన పోలీసు చర్యతో 1948 సెప్టెంబరు 17న ఈ ప్రాంతం నిజాం పాలన నుంచి విముక్తి పొందింది. సెప్టెంబరు 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. హైదరాబాద్ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన వారికి గుర్తుగా, నేటి యువతలో దేశభక్తి నింపడానికి భారత ప్రభుత్వం ఏటా సెప్టెంబరు 17ను హైదరాబాద్ విమోచన (లిబరేషన్) దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది" అని నోటిఫికేషన్‌లో కేంద్ర హోంశాఖ పేర్కొంది.దీనిపై హోంమంత్రి అమిత్ షా ట్వీటర్ ద్వారా స్పందిస్తూ.. హైదరాబాద్ విమోచన ఉద్యమంలో అమరవీరుల స్మారకార్థం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీని హైదరాబాద్ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని ప్రధాని నిర్ణయించారని.. ఇది చారిత్రాత్మకమైన రోజు అని హోంమంత్రి అమిత్ షా అన్నారు. హైదరాబాద్ ప్రాంతాన్ని దారుణమైన నిజాం పాలన నుంచి విముక్తి చేసి భారతదేశంలో విలీనం చేసేందుకు అత్యున్నత త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు, అమరవీరులకు ఈ నిర్ణయం సముచిత నివాళి అన్నారు. యువతలో దేశభక్తి జ్వాల రగిలించి, స్వాతంత్ర్య ఉద్యమంలో మన చిహ్నాలను చిరస్థాయిగా నిలిపే మోదీ ఈ కీలక నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పారు.

# ఎన్నికల నిర్వహణకు అన్నివిధాలా సన్నద్ధం కావాలి

## -రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ద్వారా ఏ క్షణంలోనైనా షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని, ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఎన్నికల నిర్వహణ అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఓటరు నమోదు, మార్పులు–చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, వాటి సత్వర పరిష్కారం, 18 – 19 వయస్సు కలిగిన యువతచే ఓటరు జాబితాలో పేర్లు నమోదు కోసం దరఖాస్తులు చేయించడం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, మోడల్ పీ.ఎస్ ల ఏర్పాటు, మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్ల విషయంలో చేపట్టాల్సిన చర్యలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రాండమైజేషన్, భద్రతాపరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ, జిల్లా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గత ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సెక్టోరల్ అధికారులచే సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సేకరించాలని, వాటి వివరాలను సకాలంలో పంపించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లైతే శనివారం మొదటి ర్యాండమైజేషన్ జరపాలని, ఈ.వీ.ఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఒకే రోజున, ఒకే సమయంలో అన్ని జిల్లాలలో చేపట్టాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని, తమకు పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పించలేదని ఏ ఒక్కరు కూడా ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం కల్పించవద్దని హితవు పలికారు. వీడియో కాన్ఫరెన్సు లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమర్థవంతమైన, స్పష్టమైన ఎలక్టోరల్ రోల్ ను తయారు చేయాలని, ఎన్నికల షెడ్యూల్ కు పెండింగ్లో ఉన్న ఫామ్స్ అన్నియు పూర్తి చేయాలనీ అన్నారు. పారదర్శకమైన ఎన్నికల జాబితా తయారు చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంలో జాగ్రత్త వహించాలని నోడల్ అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్ , ఆర్ డి ఓ విజయకుమారి, శ్రీనివాసులు ,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్ , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'ఇండియాస్ టెకేడ్: చిప్స్ ఫార్ వికసిత్ భారత్' కార్యక్రమం లో పాలుపంచుకొన్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 14:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మూడు సెమికండక్టర్ ప్రాజెక్టుల కు ఈ రోజు న వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యం ద్వారా శంకుస్థాపన చేయడం తో పాటుగా, 'ఇండియాస్ టెకేడ్: చిప్స్ ఫార్ వికసిత్ భారత్' కార్యక్రమం లో పాలుపంచుకొని సభికుల ను ఉద్దేశించి ప్రసంగించారు కూడాను. ఈ రోజు న శంకుస్థాపన జరిగిన సెమికండక్టర్ ప్రాజెక్టు లు మూడిటి విలువ దాదాపు గా 1.25 లక్షల కోట్ల రూపాయలు గా ఉంది. ఈ రోజు న ప్రారంభించిన సదుపాయాల లో గుజరాత్ లో ధోలెరా స్పెశల్ ఇన్వెస్ట్ మెంట్ రీజియన్ (డిఎస్ఐఆర్) లోని సెమికండక్టర్ ఫేబ్రికేశన్ ఫెసిలిటీ, అసమ్ లోని మోరీగాంవ్ లో అవుట్‌సోర్స్ డ్ సెమికండక్టర్ అసెంబ్లి ఎండ్ టెస్ట్ (ఒఎస్ఎటి) ఫెసిలిటీ తో పాటు గుజరాత్ లోని సాణంద్ లో అవుట్‌సోర్స్ డ్ సెమికండక్టర్ అసెంబ్లి ఎండ్ టెస్ట్ (ఒఎస్ఎటి) సదుపాయం భాగం గా ఉన్నాయి.

ఈ సందర్భం లో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, గుజరాత్ లోని సాణంద్ లో, ధోలెరా లో, అసమ్ లోని మోరిగాంవ్ లో దాదాపు గా 1.25 లక్షల కోట్ల రూపాయల విలువైన మూడు ప్రధాన సెమికండక్టర్ తయారీ ప్రాజెక్టుల కు శంకుస్థాపన జరగడం ఒక చరిత్రాత్మకమైన ఘట్టం, మరి ఇది భారతదేశం యొక్క ప్రకాశవంతమైన భవిష్యత్తు దిశ లో పడినటువంటి ఒక ముఖ్యమైన అడుగు అంటూ అభివర్ణించారు. "ఈ రోజు న చేపట్టుకొన్న ప్రాజెక్టు లు భారతదేశాన్ని ఒక సెమికండక్టర్ హబ్ గా తీర్చిదిద్దడం లో ప్రముఖ పాత్ర ను పోషించనున్నాయి" అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఈ కీలక కార్యక్రమాల కు గాను పౌరుల కు అభినందనల ను ఆయన వ్యక్తం చేశారు. ఈ రోజు న జరిగిన కార్యక్రమం లో తైవాన్ కు చెందిన సెమికండక్టర్ పరిశ్రమ ప్రముఖులు వర్చువల్ పద్ధతి లో పాలుపంచుకోవడాన్ని ప్రధాన మంత్రి ప్రస్తావించి, భారతదేశం యొక్క ఈ ప్రయాసల కు గాను ఆయన తన ఉత్సాహాన్ని వెలిబుచ్చారు.

ఈ రోజు న జరిగిన విశిష్టమైన కార్యక్రమం తో 60,000 కు పైగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మరియు విద్య బోధన సంస్థలు జత పడ్డాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ రోజు న జరిగిన ఈ యొక్క కార్యక్రమం దేశ యువతీ యువకులు కలలు గన్న కార్యక్రమం, భారతదేశం భవిష్యత్తు కు నిజమైన స్టేక్ హోల్డర్స్ యువతీ యువకులు కావడమే దీనికి కారణం అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. గ్లోబల్ సప్లయ్ చైన్ లో స్వయం సమృద్ధి యుక్తమైనటువంటి విధం గాను మరియు పటిష్టమైనటువంటి విధం గాను ముందుకు పోయేందుకు భారతదేశం బహుముఖీనమైన తరహా లో ఏ విధం గా పాటుపడుతున్నదీ యువత గమనిస్తోంది అని ఆయన అన్నారు. "ఆత్మవిశ్వాసం కలిగిన యువత దేశ భాగ్యాన్ని మార్చి వేస్తుంది '' అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

సాంకేతిక విజ్ఞానం చోదక శక్తి గా ఉంటున్నటువంటి 21 వ శతాబ్దం లో ఎలక్ట్రానిక్స్ చిప్స్ కు ఎంతో ప్రాముఖ్యం ఉందని ప్రధాన మంత్రి చెప్తూ, భారతదేశాన్ని ఆత్మనిర్భరత దిశ లో మరియు ఆధునికీకరణ దిశ లో పయనించేటట్లు చూడడం లో మేడ్ ఇన్ ఇండియా చిప్ లు, డిజైన్డ్ ఇన్ ఇండియా చిప్ లు ఒక ప్రముఖ పాత్ర ను పోషించ నున్నాయన్నారు. వేరు వేరు కారణాల రీత్యా మొదటి మూడు పారిశ్రామిక విప్లవాల లో పాల్గొనలేకపోయిన భారతదేశం ప్రస్తుతం నాలుగో పారిశ్రామిక విప్లవం 'ఇండస్ట్రీ 4.0' కు నాయకత్వం వహించాలన్న సంకల్పం తో అడుగులు వేస్తోంది అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రతి ఒక్క సెకండు ను ఉపయోగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రధాన మంత్రి స్పష్టం చేస్తూ, ప్రభుత్వం ఎంత వేగం తో కృషి చేస్తోందనే దానికి ఉదాహరణ గా ఈ రోజు న జరుగుతున్న కార్యక్రమం నిలచింది అన్నారు. సెమికండక్టర్ రంగం లో పురోగమనం యొక్క క్రమాన్ని గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, రెండేళ్ళ క్రితం సెమికండక్టర్ మిశను ను ప్రకటించడమైంది, కొద్ది నెలల లోనే తొలి ఎమ్ఒయు లపై సంతకాలయ్యాయి; ఇక ఇప్పుడు మూడు ప్రాజెక్టుల కు శంకుస్థాపన లు జరుగుతూ ఉన్నాయి అన్నారు. "భారతదేశం వాగ్దానాన్ని చేస్తుంది, భారతదేశం నెరవేర్చుతుంది, ఇంకా ప్రజాస్వామ్యం నెరవేర్చుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

ప్రస్తుతం ప్రపంచం లో సెమికండక్టర్ లను తయారు చేస్తున్న దేశాల ను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చును అని ప్రధాన మంత్రి చెప్తూ, కరోనా వైరస్ మహమ్మారి విజృంభించిన ఫలితం గా చోటు చేసుకొన్న విచ్ఛిన్నాల నేపథ్యం లో ఒక విశ్వసనీయ సప్లయ్ చైన్ తాలూకు అవసరం పెరిగిపోయింది అని నొక్కి చెప్పారు. ఈ విషయం లో ఒక కీలకమైన పాత్ర ను పోషించాలని భారతదేశం ఉత్సాహ పడుతోంది అని ఆయన అన్నారు. ఈ సందర్భం లో దేశం లోని సాంకేతిక విజ్ఞాన రంగం గురించి, పరమాణు శక్తి ని గురించి మరియు డిజిటల్ సత్తా ను గురించి ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు. సెమికండక్టర్ రంగం లో వాణిజ్య సరళి లో ఉత్పత్తి ని చేపట్టడాని కి భారతదేశం లో స్థితి సానుకూలం గా ఉంది అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానిస్తూ, ఈ రంగం లో రాబోయే కాలం లో అమలు చేయబోయే ప్రణాళికల ను గురించి వివరించారు. "సెమికండక్టర్ రంగం కోసం అవసరమైన ఉత్పత్తుల ను తయారు చేయడం లో భారతదేశం ఒక గ్లోబల్ పవర్ గా మారే రోజు ఎంతో దూరం లో లేదు" అని ఆయన అన్నారు. ఈ రోజు న తీసుకొన్న విధాన నిర్ణయాల ద్వారా భవిష్యత్తు లో భారతదేశం వ్యూహాత్మకమైనటువంటి ప్రయోజనాన్ని అందుకోనుంది అని ఆయన అన్నారు. ఈ సందర్భం లో చట్టాల ను ఇట్టే అర్థం చేసుకొనేటట్టుగా రూపుదిద్దడం తో పాటు వ్యాపార నిర్వహణ లో సౌలభ్యం కూడా ప్రోత్సాహకరం గా మారింది అని ఆయన అన్నారు. గత కొన్నేళ్ళ లో 40,000 కు పైచిలుకు పాటించక తప్పనిసరైన నియమాల ను తొలగించడమైంది, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ) నియమాల ను సులభతరం గా మార్చడమైంది అని ప్రధాన మంత్రి వెల్లడించారు. రక్షణ, బీమా మరియు టెలికం రంగాల లో ఎఫ్‌డిఐ సంబంధి విధానాల ను సరళతరం చేయడమైందన్నారు. ఎలక్ట్రానిక్స్ లోను, హార్డ్ వేర్ మేన్యుఫేక్చరింగ్ లోను భారతదేశం స్థితి అంతకంతకు వృద్ధి చెందుతోంది అని కూడా ప్రధాన మంత్రి తెలిపారు. ఆయా రంగాల లో ఉత్పత్తి తో ముడిపెట్టిన ప్రోత్సాహకం (పిఎల్ఐ) పథకాలు పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్స్ తయారీ కి, ఇంకా ఐటి హార్డ్ వేర్ తయారీ కి సానుకూలమైనటువంటి వాతావరణాన్ని ఏర్పరచాయి, దీనికి తోడు ఎలక్ట్రానిక్ క్లస్టర్ లను ఏర్పాటు చేయడం జరిగింది. వీటి ద్వారా ఎలక్ట్రానిక్ ఇకోసిస్టమ్ యొక్క వృద్ధి కి ఒక వేదిక ను అందుబాటు లోకి తీసుకు రావడమైంది అని ఆయన చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం లో రెండో అతి పెద్దదైన మొబైల్ తయారీదారు దేశం గా భారతదేశం ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం యొక్క క్వాంటమ్ మిశను ను గురించి, భారతదేశం లో నూతన ఆవిష్కరణ లను ప్రోత్సహించడాని కి మరియు ఎఐ మిశన ను విస్తరించడానికి నేశనల్ రిసర్చ్ ఫౌండేశను ను ఏర్పాటు చేయడాన్ని గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, సాంకేతిక విజ్ఞానాన్ని అక్కున చేర్చుకోవడం తో పాటు సాంకేతిక విజ్ఞాన రంగం లో పురోగతి దిశ లో కూడాను భారతదేశం సాగిపోతుందన్నారు.

సెమికండక్టర్ పరిశోధన వల్ల యువతకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని ప్రధాన మంత్రి అన్నారు. విస్తృత శ్రేణి పరిశ్రమలలో సెమికండక్టర్ల విస్తృతిని ప్రస్తావిస్తూ, "సెమికండక్టర్ అనేది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు, ఇది అపరిమితమైన సామర్థ్యంతో నిండిన ద్వారాలను తెరుస్తుంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

గ్లోబల్ చిప్ డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్ లో భారతీయ ప్రతిభావంతులు పెద్ద సంఖ్యలో ఉన్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందువల్ల సెమికండక్టర్ తయారీ రంగంలో దేశం నేడు ముందుకు సాగుతున్న కొద్దీ భారతదేశం సామర్థ్య పర్యావరణ వ్యవస్థ (టాలెంట్ ఎకోసిస్టమ్) పూర్తయిందని ప్రధాన మంత్రి అన్నారు. స్పేస్ అయినా, మ్యాపింగ్ సెక్టార్ అయినా నేటి యువతకు ఉన్న అవకాశాల గురించి బాగా తెలుసని, ఈ రంగాలను యువత కోసం తెరవాలని సూచించారు.

భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్ గా ఎదగడానికి అపూర్వమైన ప్రోత్సాహకాలు, ప్రోత్సాహం లభించిందని, సెమీకండక్టర్ రంగంలో స్టార్టప్ లకు నేటి సందర్భం కొత్త అవకాశాలను సృష్టిస్తుందని అన్నారు. నేటి ప్రాజెక్టులు యువతకు అనేక అధునాతన సాంకేతిక ఉద్యోగాలను అందిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎర్రకోట నుంచి తాను చేసిన నినాదాలను గుర్తుచేసుకున్న ప్రధాన మంత్రి – యహి సమయ్ హై సహి సమయ్ హై, ఈ నమ్మకంతో తీసుకున్న విధానాలు, నిర్ణయాలు గణనీయమైన ఫలితాలను ఇస్తాయని అన్నారు. భారత్ ఇప్పుడు పాత ఆలోచనలు, పాత విధానం కంటే చాలా ముందుకు వెళ్లింది. భారత దేశం ఇప్పుడు వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. విధానాలను రూపొందిస్తోంది" అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశ సెమీ కండక్టర్ కలలు 1960వ దశకంలో మొదట ఊహించబడ్డాయని, కానీ సంకల్పం లేకపోవడం, తీర్మానాలను విజయాలుగా మార్చే ప్రయత్నం లేని కారణంగా అప్పటి ప్రభుత్వాలు వాటిపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని ఆయన గుర్తు చేశారు. దేశ సామర్థ్యాన్ని, ప్రాధాన్యాలను, భవిష్యత్ అవసరాలను గత ప్రభుత్వాలు అర్థం చేసుకోలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ముందుచూపు, ఫ్యూచరిస్టిక్ విధానాన్ని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలనే ఆకాంక్ష తో సెమీ కండక్టర్ల తయారీ పై దృష్టి పెట్టినట్టు చెప్పారు. పేదలకు పక్కా ఇళ్లలో పెట్టుబడులు పెట్టడం, పరిశోధనలను ప్రోత్సహించడం, ప్రపంచంలోనే అతిపెద్ద పారిశుద్ధ్య ఉద్యమాన్ని నడపడం నుంచి సెమీకండక్టర్ ల తయారీ వైపు పురోగమించడం, పేదరికాన్ని వేగంగా తగ్గించడంనుంచి , భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడుల వరకు ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంగా దేశంలోని అన్ని ప్రాధాన్యాలను పరిగణనలోకి తీసుకుందని ఆయన పేర్కొన్నారు. ఒక్క 2024లోనే రూ.12 లక్షల కోట్లకు పైగా విలువైన పథకాలకు శంకుస్థాపనలు జరిగాయని, రూ.12 లక్షల కోట్లకు పైగా విలువైన పథకాలను ప్రారంభించామని తెలిపారు. 21వ శతాబ్దపు భారత స్వావలంబన రక్షణ రంగానికి అద్దం పట్టిన భారత్ శక్తి విన్యాసాన్ని ప్రస్తావిస్తూ, అగ్ని–5 రూపంలో భారత్ ప్రపంచంలోని ప్రత్యేక క్లబ్ లో చేరిందని ప్రధాన మంత్రి అన్నారు. రెండు రోజుల క్రితం వ్యవసాయంలో డ్రోన్ విప్లవానికి శ్రీకారం చుట్టామని, నమో డ్రోన్ దీదీ పథకం కింద వేలాది డ్రోన్లను మహిళలకు అంద చేసినట్టు తెలిపారు. గగన్ యాన్ కోసం భారతదేశం సన్నాహాలు ఊపందుకున్నాయని చెప్పారు. ఇటీవల ప్రారంభించిన భారతదేశపు మొదటి మేడ్ ఇన్ ఇండియా ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ గురించి ప్రస్తావించారు. ఈ ప్రయత్నాలన్నీ, ఈ ప్రాజెక్టులన్నీ భారతదేశాన్ని అభివృద్ధి లక్ష్యానికి దగ్గరగా తీసుకెళ్తున్నాయి. ఖచ్చితంగా, ఈ రోజు ఈ మూడు ప్రాజెక్టులు కూడా ఇందులో పెద్ద పాత్ర పోషిస్తాయి", అని ప్రధాని మోదీ అన్నారు.

నేటి ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిర్భావాన్ని కూడా ప్రధాన మంత్రి ప్రస్తావించారు. తన ప్రసంగాలు తక్కువ సమయంలో బహుళ భాషల్లోకి అనువదించబడిన ఉదాహరణను ఇచ్చారు.

వివిధ భారతీయ భాషల్లో ప్రధాన మంత్రి సందేశాన్ని దేశవ్యాప్తంగా వ్యాప్తి చేయడానికి భారత యువత చొరవ తీసుకున్నారని ఆయన ప్రశంసించారు. భారత యువత సమర్థులని, వారికి అవకాశం అవసరమన్నారు. "సెమీకండక్టర్ చొరవ ఈ రోజు భారతదేశానికి ఆ అవకాశాన్ని తీసుకువచ్చింది" అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను ఆయన ప్రశంసించారు. అస్సాంలో మూడు సెమీ కండక్టర్ ప్లాంట్లలో ఒకదానికి నేడు శంకుస్థాపన జరుగుతోందన్నారు. ప్రసంగాన్ని ముగించిన ప్రధాన మంత్రి, భారతదేశ పురోగతిని బలోపేతం చేయాలని ప్రతి ఒక్కరికీ ఉద్బోధించారు. " మోదీ హామీ మీకు ఇంకా మీ భవిష్యత్తుకు" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్, అస్సాం ముఖ్యమంత్రి శ్రీ హిమంత బిశ్వ శర్మ, గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, ,సిజి పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్ చైర్మన్ శ్రీ వెల్లయన్ సుబ్బయ్య, టాటా సన్స్ చైర్మన్ శ్రీ నటరాజన్ చంద్రశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

సెమీకండక్టర్ డిజైన్, తయారీ, సాంకేతిక అభివృద్ధికి భారత్ ను గ్లోబల్ హబ్ గా నిలబెట్టడం, దేశ యువతకు ఉపాధి అవకాశాల కల్పనను ప్రోత్సహించడం ప్రధాన మంత్రి దార్శనికత. ఈ విజన్ కు అనుగుణంగా గుజరాత్ లోని ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్ మెంట్ రీజియన్ ( డిఎస్ఐఆర్ )లో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీకి శంకుస్థాపన చేశారు. అసోంలోని మోరిగావ్ లో ఔట్ సోర్సింగ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓశాట్) సదుపాయం ఉంది. గుజరాత్ లోని సనంద్ లో ఔట్ సోర్సింగ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓశాట్) సదుపాయం ఉంది.

భారతదేశంలో సెమీకండక్టర్ ఫ్యాబ్స్ ఏర్పాటు కోసం సవరించిన పథకం కింద ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్మెంట్ రీజియన్ (డిఎస్ఐఆర్) వద్ద సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీని టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టిఇపిఎల్) ఏర్పాటు చేస్తుంది. మొత్తం రూ.91,000 కోట్లకు పైగా పెట్టుబడితో దేశంలోనే తొలి కమర్షియల్ సెమీకండక్టర్ ఫ్యాబ్ ఇదే అవుతుంది.

అస్సాంలోని మోరిగావ్ లో ఔట్ సోర్సింగ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓశాట్) సదుపాయాన్ని టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఈపీఎల్) మోడిఫైడ్ స్కీమ్ ఫర్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్ అండ్ ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) కింద సుమారు రూ.27,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది.

సనంద్ లో ఔట్ సోర్సింగ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓశాట్) సదుపాయాన్ని సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్ మోడిఫైడ్ స్కీమ్ ఫర్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్ అండ్ ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) కింద సుమారు రూ.7,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది.

ఈ సౌకర్యాల ద్వారా సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ బలోపేతం అవుతుంది. భారత్ లో సుస్థిర స్థానం లభిస్తుంది. లభిస్తుందన్నారు. ఈ యూనిట్లు సెమీకండక్టర్ పరిశ్రమలో వేలాది మంది యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ఎలక్ట్రానిక్స్, టెలికాం వంటి సంబంధిత రంగాల్లో ఉపాధి కల్పనకు ఊతమివ్వనున్నాయి.

ఈ కార్యక్రమంలో వేలాది మంది కళాశాల విద్యార్థులు, సెమీకండక్టర్ పరిశ్రమకు చెందిన నాయకులతో సహా యువకులు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని వీక్షించారు.

# ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలి



మహబూబ్‌నగర్, మార్చి 14:మహబూబ్ నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కొత్తూరు మండల పరిధిలోని మక్తాగూడా గ్రామంలో బైక్ ర్యాలీనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తూరు మండల పరిధిలోని మక్తగూడ, గూడూరు, మల్లాపూర్, ఇన్ముల్ నర్వ, జేపీ దర్గా మీదుగా బైక్ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లీ శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, కేశంపేట జెడ్పీటీసీ విశాలశ్రావణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాలుగు వరుసల రహదారి నిర్మాణం కోసం రూ.292.65 కోట్లు మంజూరు చేసిన శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, మార్చి 14:జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో ఉన్న 114ఏ జాతీయ రహదారిపై టవర్ చౌక్ నుంచి బసుకినాథ్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం కోసం రూ.292.65 కోట్లు మంజూరైనట్లు కేంద్ర రహదారి రవాణా ఉ జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ట్వీట్ చేశారు.

ఈ ప్రాజెక్టు వల్ల దేవఘర్, బసుకినాథ్ వంటి కీలక పుణ్యస్థలాలకు మరింత సులభంగా రాకపోకలు సాగించవచ్చని శ్రీ గడ్కరీ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రహదారి శ్రావణి మేళా సమయంలో రాకపోకలకు సరిపోదు. భక్తులు దేవఘర్, బసుకినాథ్ సందర్శించడానికి ఆ మార్గాన్ని ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఉన్న 2 వరుసల రహదార్లను నాలుగు వరుసలుగా మార్చాల్సిన అవసరం ఉంది. దీనివల్ల రద్దీ తగ్గడంతో పాటు ఆ ప్రాంత సామాజిక–ఆర్థిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు తోడ్పడుతుంది.

## జిల్లాలో 2529 మందికి ఈబిసి నేస్తం...

శ్రీకాకుళం,మార్చి 14: : జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన 2,529 మందికి మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి గురువారం రూ.378.35 లక్షలను విడుదల చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లె లో జరిగిన ఈ కార్యక్రమంలో, ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారం చేసిన అనంతరం కలెక్టర్ మనజీర్ జిలాని సామాన్ లబ్ధిదారులకు ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు.

కలెక్టరేట్లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఈడి గెద్దమ్మ, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజాపు హైమావతి, టి.కామేశ్వరి, పలువురు అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

### – కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్

ఖమ్మం, మార్చి 14:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులవృత్తులకు ప్రభుత్వం అండగా నిలవాలన్న సంకల్పంతో 16 కులాలకు కార్పొరేషన్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేయడం చరిత్రాత్మక ఆవిష్కరణ అని కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సబ్బండ వర్గాలకు సామాజిక న్యాయాన్ని అందించే కోణంలో ప్రభుత్వం నడుస్తుందన్నారు..ఈ కార్పొరేషన్ల ద్వారా అన్ని కులాలకు ఒక చేయూత దొరకడంతో పాటు, కనుమరుగవుతున్న కుల వృత్తులను కూడా కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నది..తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ వస్తేనే న్యాయం జరుగుతుందని విశ్వసించారు..వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు...అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 6గ్యారంటీలను 100రోజుల లోపు అమలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం..అదే విదంగా కుల వృత్తులకు ఆర్థికంగా సహాయాన్ని అందించి వారిని బలోపేతం చేసేందుకు, కుల వృత్తులకు సాంకేతికత జోడించి మరింత ముందుకు తీసుకెళ్లాలని క్యాబినెట్ నిర్ణయించడం సంతోషకరం అన్నారు. గత ప్రభుత్వం ఎంబిసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000కోట్లు కేటాయించింది, చివరకి వాటిని కూడా ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాకుండా బలహీన వర్గాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారిని బలోపేతం చేయాలని నిర్ణయించిందన్నారు.






# ఆత్మరక్షణకు కరాటే ఎంతో ముఖ్యం

## -కరాటే మాస్టర్ అశోక్ జన్మదిన వేడుకలలో కోవూరి సత్యనారాయణ



సదాశివపేట మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); సంగారెడ్డి జిల్లా, సదాశివపేట పట్టణంలో పరమశివ పిరమిడ్ ధ్యాన కేంద్రం మరియు మిత్రబృందం ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ అశోక్ జన్మదిన వేడుకలు అమ్మ ఒడి హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ హాజరైన కరాటే మాస్టర్ అశోక్ ను శాలువాతో సన్మానించి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అభినందించారు. సమ సమాజ పునర్నిర్మాణం కోసం నీ యొక్క ప్రతిభ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు కరాటే నేర్పించడం మరియు ప్రత్యేక శ్రద్ధ వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని వీళ్లే రేపటి దేశ రక్షకులుగా మారుతారని ఇట్టి బృహత్కార్యాన్ని చేపడుతున్న కరాటే మాస్టర్ అశోక్ మరియు వారి యొక్క గురువులకు జన్మదిన వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా త్రికరణ శుద్ధితో అభినందనలు తెలియజేశారు.

కరాటే మాస్టర్ లకు ఎప్పుడు చరిత్రలో గుర్తించదగ్గ వ్యక్తులుగా చరిత్ర చెప్పుకోవడానికి గర్వంగా భావితరాలు బాగుపడడానికి ఎప్పుడు వెన్నంటూ వెన్నెముకల కరాటే మాస్టర్ల వెంట ఉంటానని బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ తన వంతు బాధ్యతగా తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పులి సంఘప్ప గౌడ్, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కూరెళ్ళ సదానంద్, మోమిన్పేట్ మండల్ బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, బిజెపి నాయకులు పులి సాయి కిరణ్ గౌడ్ మరియు పరమశివ పిరమిడ్ కేంద్రం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా సత్తమ్మ తల్లి వార్షిక జాతర.. వేలాదిగా తరలివచ్చిన భక్తులు



అమరావతి, మార్చి 14:సింహాద్రినాథుడి సోదరి, 14 గ్రామాల ప్రజల పొలిమేర దేవత శ్రీ సత్తమ్మతల్లి వార్షిక జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతీ ఏటా మార్చి 14న అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకొని వార్షిక జాతరను గత కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన గావించారు. అనంతరం సర్వాభరణాలుతో అందంగా అలంకరించారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకమలు సమర్పించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆలయ కమిటి భక్తులకు ప్రసాద వితరణ, అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహించింది. సాయంత్రం భారీగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు పి.వెంకటరావు, కమిటీ సభ్యులు గంట్ల కనకరాజు, బలిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. పెద్దఎత్తున పూల, విద్యుత్ అలంకరణలు చేశారు.

### ఆలయ అభివృద్ధికి సహకరించండిః

అమ్మవారిని సింహాచలం దేవస్థానం ఈఓ సింగం శ్రీనివాసమూర్తి దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఈఓను ఘనంగా సత్కరించింది. అప్పన్న సోదరిగా విరాజిల్లుతున్న సత్తమ్మతల్లి ఆలయ అభివృద్ధికి సింహాచలం దేవస్థానం తరపున సహకరించాలని ఈ సందర్భంగా ఆలయ కమిటి ఈఓను కోరింది. ఇందుకు ఈఓ సానుకూలంగా స్పందించారు. తమ పరిధి మేరకు ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా, పలువురు ప్రజాప్రతినిధులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

### భక్తుల సౌకర్యార్థం వాటర్ డిస్పెన్సరీలు విరాళం సౌత్ ఇండియా వస్త్ర సంస్థ 25మిషిన్లు పలు ప్రాంతాల్లో ప్రారంభం..

రాష్ట్రంలోని ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థలు ఆర్ ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంయుక్తంగా 25 వాటర్ కూల్ అండ్ హాట్ వాటర్ మిషన్స్ దేవస్థానానికి విరాళంగా సమర్పించారు. ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీను బాబు, దినేష్ రాజ్ తదితరులు వీటిని గురువారం ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులు నడయాడే పలు ప్రదేశాల్లో వీటిని అందుబాటులో పెట్టారు. వీటి ఏర్పాటుతో భక్తులకు మంచినీటి సమస్యలు తీరనున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు డాక్టర్ టి పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ప్రత్యేక ఆహ్వానితులు నరసింహ మూర్తి, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈఓలు భ్రమరారంభ, నరసింగరావు రమణమూర్తితో పాటు పి ఆర్ ఓ దమ్ము అప్పలనాయుడు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానంలో ఈనెల 26నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న వేద హవనం పూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం ఏర్పాట్లకు సంబంధించిన ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం విభాగాధిపతులతో ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి గురువారం సమావేశమై చర్చించారు. యజ్ఞంలో భక్తులను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయడానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. యజ్ఞంలో పాల్గొనే ఉభయ దాతలు వారితో పాటు వచ్చే కుటుంబ సభ్యులకు కల్పించే సదుపాయాలపై చర్చించారు. అనంతరం వీరంతా వెళ్లి యజ్ఞశాలను పరిశీలించారు. హోమ గుండాలు ఏర్పాటు, భక్తులు ఆశీనులను చేసే ప్రదేశాలను వైదికులు వివరించి చెప్పారు. పాంచాహ్నిక దీక్షతో జరిగే యజ్ఞంలో ప్రతీరోజూ సాయంత్రం స్వామివారి వాహన సేవలు నిర్వహించనున్నట్లు స్థానాచార్యులు, ప్రధానార్చకులు ప్రకటించారు. రోజుకో వాహనంలో స్వామి సింహగిరి వీధుల్లో విహరించనున్నట్లు తెలియజేశారు. తిరువీధుల్లో స్వామివారికి ముందు కోలాటాలు, భజనలు ఏర్పాటు చేయనున్నట్టు ఈఓ చెప్పారు.

### లోక కళ్యాణం కోసమే సుదర్శన నారసింహ మహా యజ్ఞం..

శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానంలో ఈనెల 26 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న వేద హవనం పూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం ఏర్పాట్లకు సంబంధించిన ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, ఆహ్వానితులు నరసింహ మూర్తి, దేవస్థానం విభాగాధిపతులతో ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి గురువారం సమావేశమై చర్చించారు. యజ్ఞంలో భక్తులను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయడానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. యజ్ఞంలో పాల్గొనే ఉభయ దాతలు వారితో పాటు వచ్చే కుటుంబ సభ్యులకు కల్పించే సదుపాయాల పై చర్చించారు. అనంతరం వీరంతా వెళ్లి యజ్ఞశాలను పరిశీలించారు. హోమ కుండాలు ఏర్పాటు, భక్తులు ఆశీనులను చేసే ప్రదేశాలను వైదికులు వివరించి చెప్పారు. పాంచాహ్నిక దీక్షతో జరిగే యజ్ఞంలో ప్రతీరోజూ సాయంత్రం స్వామివారి వాహన సేవలు నిర్వహించనున్నట్లు స్థానాచార్యులు, ప్రధానార్చకులు ప్రకటించారు. రోజుకో వాహనంలో స్వామి సింహగిరి వీధుల్లో విహరించనున్నట్లు తెలియజేశారు. తిరువీధుల్లో స్వామివారికి ముందు కోలాటాలు, భజనలు ఏర్పాటు చేయనున్నట్టు ఈఓ చెప్పారు. యాగంలో పాల్గొనే భక్తులతో పాటు విరాళాలు అందించే దాతలకు పెద్ద పీట వేయాలని సమావేశంలో నిర్ణయించారు. దాతల విరాళాలకు జవాబుదారీతనం ఉంచడంతో పాటు బాధ్యతను మరింత పెంచేందుకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశామని ఈఓ చెప్పారు.

### ప్రసాద్ పథకంతో సింహగిరి దేదీప్యమానము..

కేంద్రం మంజూరు చేసిన ప్రసాద్ పథకంతో సింహగిరిపై అనేక సదుపాయాలు భక్తులకు అందుబాటులోకి రానున్నట్లు ఆలయ ఈఓ ఎస్.శ్రీనివాస్ మూర్తి తెలిపారు. రూ.54 కోట్లతో అనేక ప్రాజెక్ట్ ల నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందన్నారు.. ఇందుకు సంబందించిన శిలాఫలకం గురువారం ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, ప్రత్యేక ఆహ్వానితులు నరసింహ మూర్తి, అర్చకులు, అధికారులు ఆవిష్కరించారు..

# హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్ అలలపై లైట్ అండ్ సౌండ్ షోను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 14: హుస్సేన్ సాగర్ అలలపై వాటర్ స్క్రీన్ మ్యూజికల్ ఫౌంటెన్‌తో కూడిన ప్రత్యేకమైన లేజర్ ఆధారిత లైట్ అండ్ సౌండ్ షో 'ది కోహినూర్ స్టోరీ' ని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈరోజు 2024 మార్చి 12, న ప్రారంభించారు. ప్రజలు ప్రదర్శనలు చూసేందుకు వీలుగా సంజీవయ్య పార్క్ వద్ద. నిర్మించిన మల్టీపర్పస్ గ్యాలరీ ని కూడా మంత్రి ప్రారంభించారు.

హైదరాబాద్ , సికింద్రాబాద్ జంట నగరాల్లో ప్రస్తుతం ఉన్న పర్యాటక ఆకర్షణలతో పాటు 'ది కోహినూర్ స్టోరీ' మరో ఆకర్షణగా ఉంటుంది. తెలంగాణ నెల నుంచి బయటపడి ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన వజ్రం గా గుర్తింపు పొందిన 'కోహినూర్' కథను లైట్ అండ్ సౌండ్ షో వర్ణిస్తుంది, . కోహినూర్ పుట్టుక, సంస్కృతులు, ఖండాలలో దాని ప్రయాణం ఒక ఆసక్తికరమైన కథ. వివిధ కారణాల వల్ల ఈ కథనం ప్రభావవంతంగా ప్రజలకు చేరలేదు. కోహినూర్ కథను వెలుగులోకి తీసుకురావడానికి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. స్క్రిప్టును రాజ్యసభ సభ్యులు శ్రీ ఎస్.విజయేంద్రప్రసాద్ పర్యవేక్షణలో శ్రీ ఎన్.ఎన్.కంచి రూపొందించారు.

చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాల్లో లైట్ అండ్ సౌండ్ షో లు జరుగుతున్నాయి. అయితే సరస్సు అలలపై లైట్ అండ్ సౌండ్ షో ప్రదర్శన ఒక కొత్త ప్రయోగం. సరస్సుపై ఏర్పాటు చేసిన ఫౌంటైన్‌ల శ్రేణి హుస్సేన్ సాగర్ ను ఒక స్క్రీన్‌గా మార్చి కోహినూర్ కథను, కోహినూర్ ద్వారా తెలంగాణ కథను, దేశ సాంస్కృతిక, నాగరికత వారసత్వాన్ని అందించే రంగుల వీడియో చిత్రాన్ని ప్రదర్శిస్తుంది.

సమకాలీన ప్రాంత చరిత్రను నేపథ్య సంగీతంతో ఆడియో-విజువల్ మీడియా సహాయంతో ఫౌంటెన్ షో ద్వారా రూపొందిన ఈ సృజనాత్మక ప్రదర్శన పర్యాటక ఆకర్షణలగా ఉంటుంది. కలిగి ఉండాలని ప్రాజెక్ట్ లక్ష్యంగా పెట్టుకుంది. కూర్చుని స్ ప్రదర్శన తిలకించడానికి పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సందర్శకులకు అవసరమైన నడక మార్గాలు, ఇతర సౌకర్యాలు కల్పించారు.

# సహకార భాగస్వామ్యాల ద్వారా గిరిజనుల అభివృద్ధి వేగవంతం

న్యూఢిల్లీ, మార్చి 14:కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విభు నాయర్ నేతృత్వంలో ఈ రోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో యుఎన్ ఏజెన్సీలు మరియు ఇతర ప్రపంచ సంస్థలతో ఒక ముఖ్యమైన సమావేశాన్ని ఏర్పాటు చేసింది. "విక్షిత్ భారత్ ఏ2047 – యాక్సిలరేటింగ్ ట్రైబల్ డెవలప్మెంట్: కొలాబరేటివ్ గ్లోబల్ పార్టనర్‌షిప్స్" పేరుతో జరిగిన ఈ కార్యక్రమం సర్వీస్ డెలివరీ, ట్రైబల్ హెల్త్, ట్రైబల్ ఎడ్యుకేషన్, ట్రైబల్ లైవ్‌లీహుడ్, ట్రైబల్ సోషియో-కల్చరల్ హెరిటేజ్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి కీలక రంగాలలో భాగస్వామ్యాన్ని ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకుంది.

గిరిజన వ్యవహారాల మంత్రిత శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి.ఆర్. జయ తన స్వాగత ప్రసంగంలో సమావేశ ఎజెండాను వివరించారు.గిరిజన వ్యవహారాలు మరియు గిరిజన అభివృద్ధి రంగంలో యుఎన్ మరియు ఇతర అంతర్జాతీయ ఏజెన్సీలతో భాగస్వామ్యాన్ని అన్వేషించడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు అంతర్జాతీయ ఏజెన్సీల మధ్య వివరించిన నేపథ్య రంగాలలో సంభావ్య సహకారాలపై ఈ సమావేశంలో సానుకూల చర్చలు జరిగాయి. భారతదేశంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఈ భాగస్వామ్యాల ప్రాముఖ్యతను శ్రీ విభు నాయర్ వివరించారు మరియు దేశ అభివృద్ధిలో గిరిజన సంఘాల పాత్రను నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమానికి సహకారం అందించి విజయవంతం చేయాలని భాగస్వామ్యదారులను కోరుతూ శ్రీ విభు నాయర్ సమావేశాన్ని ముగించారు. ఐదు థీమాటిక్ రంగాలలో చర్చలు మరియు భాగస్వామ్యం పెరగవలసిన అవసరాన్ని వివరించారు. రాష్ట్రాలలో ఒకే విధమైన ప్రాంతాలలో సంస్థల మధ్య సహకారం మరియు సమన్వయాన్ని తీసుకురావడానికి కార్యకలాపాల గుర్తింపు మరియు విస్తరణకు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ గిరిజన విజయాలను ప్రదర్శించడం మరియు ఉత్తమ ప్రపంచ అభ్యాసాల నుండి నేర్చుకోవడం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన హైలైట్ చేశారు.

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ,యుఎన్ ఏజెన్సీలు మరియు అంతర్జాతీయ ఫౌండేషన్‌ల మధ్య సంభాషణను సులభతరం చేయడం ద్వారా గిరిజన అభివృద్ధిని పెంపొందించడానికి వివిధ రంగాలలో సంభావ్య సహకారాలు మరియు భాగస్వామ్యాలను అన్వేషించడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ అంశంలో చర్యలు చేపట్టాల్సిన కీలక రంగాలను గుర్తించడం, సాధ్యమయ్యే ప్రాజెక్టులు మరియు చొరవలను చర్చించడం మరియు గిరిజన సంఘాలకు స్థిరమైన ఫలితాలను నిర్ధారించడానికి సహకారం మరియు భాగస్వామ్యం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ కార్యక్రమంలో యూనిసెఫ్,యూనెప్,డబ్ల్యూహెచ్ఓ, ప్రపంచబ్యాంకు,యూఎన్‌డిపి,యూఎన్ హాబిటాట్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యునైటెడ్ నేషన్స్ వాలంటీర్, యూఎన్ ఉమెన్,యూనెస్కో,జైకా, ఐఎఫ్ఏడి,ఐఎల్ఓ,డబ్ల్యూఎస్‌పి వంటి ఐక్యరాజ్యసమితి ఏజెన్సీలు/గ్లోబల్ సంస్థలు పాల్గొన్నాయి.

ఈ కార్యక్రమంలో మిస్టర్. శోంబి షార్ప్, భారతదేశంలోని యూఎన్ రెసిడెంట్ కోఆర్డినేటర్; శ్రీమతి. పేడెన్, డిప్యూటీ హెడ్ ఆఫ్ కంట్రీ ఆఫీస్, డబ్ల్యూహెచ్ఓ; శ్రీమతి కైట్లిన్ వీసెన్, కంట్రీ హెడ్, యూఎన్‌డిపి; మిస్టర్. ఆగస్టే టానో కౌమే, కంట్రీ డైరెక్టర్, ప్రపంచ బ్యాంక్; మిస్టర్. స్టీవ్ హో యున్ జియోంగ్, డిప్యూటీ కంట్రీ డైరెక్టర్, ఏడిబి; మిస్టర్ అర్జన్ డి వాగ్ట్, డిప్యూటీ రిప్రజెంటేటివ్ ప్రోగ్రామ్ – ఓఐసీ ప్రతినిధి, యూనిసెఫ్; మిస్టర్ ఉలక్ డెమిరాగ్, డైరెక్టర్, ఐఎఫ్ఏడి మరియు అనేక ఇతర ప్రతినిధులు తమ సంస్థల అనుభవాలను పంచుకున్నారు.

# నిరుద్యోగ యువత మెగాజాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



హన్మకొండ, మార్చి 14: (నేటినిజం ప్రతినిధి) వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం పర్చుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ యువతకు పిలుపునిచ్చారు. వరంగల్ కమిషనరేట్ పోలీసుల అధ్వర్యంలో టి.యం.ఐ ఫౌండేషన్ ట్రస్ట్ వారి సహకారంతో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఈ నెల 16వ తారీఖు శనివారం రోజున స్థానిక హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం పది గంటల నుండి నిర్వహింబడే ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 3వేలకు పైగా వివిధ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలను చేపట్టడం జరగుతుందని. ఈ జాబ్ మేళాలో పాల్గొను యువత కనీసం పదవ తరగతి పాసై వుండాలి. ఇందులో పాల్గోనే యువత ముందుగా ఎతిబి.శ్రీఎ/తీఎటనీతీఎ సైట్ ద్వారా తమ వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని. వరంగల్ కమిషనరేట్ పోలీసులు అందిస్తున్న ఈ సదావకాశాన్ని సద్వినియోగించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ యువతకు తెలిపారు.

# జీడబ్ల్యుఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశ్విని తానాజీ వాకడే.



హన్మకొండ, మార్చి 14: (నేటినిజం ప్రతినిధి)జీడబ్ల్యుఎంసి కమిషనర్ గా అశ్విని తానాజీ వాకడే ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా విధులు నిర్వహిస్తున్న అశ్విని తానాజీ వాకడే ను బల్దియా కమిషనర్ గా బదిలీ చేయగా గురువారం సాయంత్రం బి డబ్ల్యు ఎం సి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

# సిఏఏని ఉపసంహరించే ప్రసక్తి లేదు



- సిఏఏని అడ్డుకునే అధికారం రాష్ట్రాలకు లేదు
-ఎవరి పౌరసత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు
-కొన్ని మతాలకు చెందిన శరణార్ధులకే భారత పౌరసత్వం
-కంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 14:పౌరసత్వ సవరణ చట్టాన్ని(సిఏఏ) వెనుకకు తీసుకునే ప్రసక్తి లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. సిఏఏని రాష్ట్రాలు అడ్డుకోలేవని, పౌరసత్వాన్ని కేవలం కేంద్ర ప్రభుత్వమే అనుమతించగలదని కూడా ఆయన తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సిఏఏపై ఒక ఆంగ్ల వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత షా అనేక సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నించారు. సిఏఏని ఉపసంహరించే ప్రసక్తి లేదని, మన దేశంలో భారతీయ పౌరసత్వాన్ని ఇవ్వాలన్న నిర్ణయం పార్లమెంట్ తీసుకున్నదని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు.

సిఏఏపై మైనారిటీలు కాని ఇతరులు ఎవరైనా కాని భయపడాల్సిన అవసరం లేదని, ఎవరి పౌరసత్వాన్ని తొలగించే నిబంధన ఏదీ సిఏఏలో లేదని ఆయన తెలిపారు. అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు చెందిన హిందూ, బౌద్ధ, జైన, సిక్కు, క్రైస్తవ, పార్శీ శరథార్ధులకు హక్కులు, పౌరసత్వాన్ని ఇచ్చేందుకు సిఏఏ ఉందని ఆయన అన్నారు. సిఏఏ ద్వారా కొత్త ఓటు బ్యాంకును బిజెపి సృష్టిస్తోందన్న ప్రతిపక్షాల ఆరోపణపై స్పందిస్తూ ప్రతిపక్షాలకు వేరే పనేమీ లేదని, చెప్పింది చేసే అలవాటు వారికి లేదని ఆయన విమర్శించారు. రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు కూడా రాజకీయ లబ్ధి కోసం చేసిందేనని వారు(ప్రతిపక్షాలు) చెప్పారని, కాని 1950 నుంచి తాము 370వ అధికరణను రద్దు చేస్తామని చెబుతున్నామని అమిత్ షా తెలిపారు.

సిఏఏ అమలుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రకటించాల్సి వచ్చిందన్న ప్రతిపక్షాల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ అసదుద్దీన్ ఒవైసీ, రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీతోసహా ప్రతిపక్ష పార్టీల నాయకులందరూ అసత్యాల రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. సిఏఏ అమలును ఉద్దేశపూర్వకంగా ఇప్పుడే చేశామనడం అసత్యమని ఆయన తెలిపారు. సిఏఏని అమలుచేసి అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు చెందిన శరణార్థులకు భారతీయ పౌరసత్వాన్ని ఇస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలోనే బిజెపి చెప్పిందని ఆయన గుర్తు చేశారు. 2019లో దీన్ని పార్లమెంట్ ఆమోదించిందని, అయితే కొవిడ్ కారణంగా అమలులో జాప్యం జరిగిందని ఆయన వివరించారు. బుజ్జగింపు రాజకీయాలు చేసి తమ ఓటు బ్యాంకును పదిలపరుచుకోవాలని ప్రతిపక్షాలు ఆశిస్తున్నాయని ఆయన అన్నారు.

వాటి బండారం బయటపడిందని, సిఏఏని ఈ దేశ చట్టంగా ప్రజలు గుర్తించారని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు సిఏఏని అమలు చేస్తామని తాను గత నాలుగేళ్లలో 41 సార్లు చెప్పానని హోం మంత్రి అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై అమిత్ షా మండిపడ్డారు. కేజ్రీవాల్ మతిస్థిమితం కోల్పోయారని ఆయన ఆరోపించారు. శరణార్థులకు పౌరసత్వం ఇస్తే చోరీలు, అత్యాచారాలు పెరిగిపోతాయంటూ కేజ్రీవాల్ చేసిన ప్రకటనను ఆయన తప్పుపట్టారు. తన అవినీతి బయటపడడంతో ఢిల్లీ ముఖ్యమంత్రి మతిస్థిమితం కోల్పోయారని ఆయన విమర్శించారు. వీరంతా(శరణార్థులు) ఇప్పటికే ఇక్కడకు వచ్చి నివసిస్తున్నారన్న విషయం ఆయనకు తెలియదని, ఆయనకు అంత ఆందోళనే ఉంటే బంగ్లాదేశీ చొరబాటుదారులు లేదా రోహింగ్యాలకు వ్యతిరేకంగా ఎందుకు మట్లాడడం లేదని అమిత్ షా ప్రశ్నించారు. కేజ్రీవాల్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

దేశ విభజన నేపథ్యం గురించి ఆయన మరచిపోయారని, శరణార్థ కులుంబాలను ఆయన కలుసుకుంటే మంచిదని హోం మంత్రి సూచించారు. సిఏఏ నోటిఫికేషన్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వచ్చే రోజు ఎంతో దూరంలో లేదని, అప్పుడు చొరబాట్లను అడ్డుకుంటామని ఆయన తెలిపారు. జాతీయ భద్రతకు సంబంధించిన ఒక ముఖ్యమైన సమస్య మీద ఇటువంటి రాజకీయాలు చేయడం తగదని ఆయన అన్నారు. బుజ్జగింపు రాజకీయాలు చేస్తూ చొరబాట్లను అనుమతిస్తున్నారని, శరణార్థులకు భారతీయ పౌరసత్వం రావడాన్ని వ్యతిరేకిస్తున్నారని, ఇలా చేయడం వల్ల మమతను ప్రజలు విశ్వసించబోరని ఆయన అన్నారు. శరణార్థికి చొరబాటుదారునికి మధ్య తేడా మమతకు తెలియడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాలలో సిఏఏ అమలు గురించి కూడా అమిత్ షా మాట్లాడారు.

సిఏఏని తమ రాష్ట్రాలలో అమలు చేయబోమంటూ కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు చేసిన ప్రకటనను ఆయన ప్రస్తావిస్తూ రాజ్యాంగంలోని 11వ అధికరణ కింద పౌరసత్వానికి సంబంధించిన సర్వాధికారాలు పార్లమెంట్‌కే ఉంటాయని అమిత్ షా తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమే తప్ప రాష్ట్ర పరిధిలోనిది కానది ఆయన అన్నారు. ఎన్నికల తర్వాత అన్ని రాష్ట్రాలు సహకరిస్తాయని తాను భావిస్తున్నానని ఆయన అన్నారు. బుజ్జగింపు రాజకీయాల కోసం ప్రతిపక్షాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. గిరిజన ప్రాంతాల కూర్పును సిఏఏ మారుస్తుందా అన్న ప్రశ్నకు అణువంత కూడా మార్చబోదని ఆయన స్పష్టం చేశారు.

సిఏఏ వల్ల గిరిజన ప్రాంతాల కూర్పు కాని, హక్కులు కాని ఏమాత్రం మారవని ఆయన తెలిపారు. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చిన ప్రాంతాలలో సిఏఏ వర్తించదని ఆయన తెలిపారు. ఆ ప్రాంతాలలోని చిరునామాలు యాప్‌లో అప్‌లోడ్ కావని, వాటిని యాప్ నుంచి మినహాయించామని ఆయన తెలిపారు. పార్లమెంట్‌లో ఆమోదించిన ఐదేళ్ల తర్వాత సిఏఏని గత సోమవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం మరి కొద్ది రోజులలో లోక్‌సభ ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ముందు ఈ నోటిఫికేషన్ వెలువడడం గమనార్హం.

# ఈ ఐదేళ్లు ప్రజాసేవ చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటా

హైదరాబాద్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఈ ఐదేళ్లు ప్రజాసేవ చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయనని ఖచ్చితంగా చెప్పారు.

వేరే పార్టీల నుండి నా కుటుంబ సభ్యులు పోటీ చెయ్యరన్నారు. డీకే శివకుమార్ తన మిత్రుడని చెప్పారు. వ్యాపార విషయంలో రెండు రోజుల క్రితం డీకేను కలిశానని బీఆర్ఎస్ మల్లారెడ్డి పేర్కొన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో డికె శివకుమార్ కలిశానన్నారు.

శివకుమార్ ను కలవడంతో ఎలాంటి రాజకీయం లేదని వివరణ ఇచ్చారు. పార్టీ మారడం లేదు, బిఆర్ఎస్ లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

# మహంకాళి అమ్మవారి సేవలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మెదక్, మార్చి 14:మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేగుంటలో పర్యటించారు. చేగుంటలోని మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు రఘునందన్‌రావుకు వేద ఆశీర్వనలు అందించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎంపీ అభ్యర్థిగా ఎంపికై మొదటి సారిగా చేగుంటకు వచ్చిన రఘునందన్‌రావుకు బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయనకు బీజేపీ శ్రేణులు శాలువా పూలమాలలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికులుగా పనిచేయాలని రఘునందన్‌రావు పేర్కొన్నారు. మూడోసారి కూడా బీజేపీ కేంద్రం అధికారంలో వస్తుందన్నారు. తనకు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.


ఆహ్వానము
GVR CULTURAL FOUNDATION
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

శ్రీ గుడిబండి వెంకట్ రెడ్డి
83వ జన్మదినోత్సవ వేడుకలు
జీవీఆర్ ఆత్మీయ పురస్కారాలు
జీవీఆర్ సాహితీ కిరణం సౌజన్యంతో నిర్వహించిన
పోస్ట్‌కార్డ్ కథల పోటీ విజేతలకు నగదు పురస్కారాల ప్రదానోత్సవం
శ్రీ వి.వి. రాఘువరెడ్డి ఆనందనిలయానికి రూ. 50,000/- నగదు విరాళం

ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్. (రి).
గౌరవ అతిథి : శ్రీ సి. రామకృష్ణ, పూర్వ జనరల్ మేనజర్, దక్షిణమధ్య రైల్వే
సభాధ్యక్షులు : లయన్ డా. చిల్లా రాజశేఖరరెడ్డి, పారిశ్రామికవేత్త
సభాప్రారంభం : శ్రీ లంక లక్ష్మీనారాయణ, అధ్యక్షులు, యువకళావాహిని
పురస్కార స్వీకర్తల స్వాగతసత్కారం : డా॥ రామరాజు శ్రీనివాస రావు
చైర్మన్ సౌత్‌జోన్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్, గుంటూరు.
అతిథుల స్వాగతసత్కారం : శ్రీ కొండపాక కృష్ణమాచార్య
రాష్ట్ర అధ్యక్షులు, శ్రీవేద దార్మిక సేవా సమితి
జ్యోతిప్రకాశనం : శ్రీమతి గిడుగు కాంతికృష్ణ
గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ చైర్మన్
అతిథులకు జ్ఞాపికల బహూకరణ : శ్రీమతి కె. విజయలక్ష్మి, సామాజికవేత్త
ఆత్మీయ అతిథి : శ్రీమతి వి.శైలజ, తెలుగు భాష ప్రచారకర్త
నృత్య కళాకారుల సత్కారం : డా॥ ఐశ్వర్య పాతపాటి మిస్ గ్లోబల్ ఇండియా 2023
నిర్వహణ : శ్రీమతి టి.వి. శిరీష, నర్తకి, నాట్యం, సంగీతం గురువు

02-04-2024, మంగళవారం, సా॥ 5-00 గంటలకు
శ్రీ త్యాగరాయ గానసభ (ప్రధానమందిరం), చిక్కడపల్లి, హైదరాబాద్.

# ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

## -కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

-ఎన్నికల వ్యయ వివరాలను పకడ్బందిగా నమోదు చేయాలి
-అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు
-నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి
-ఎన్నికల వ్యయ వివరాలు నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లఘనలపై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

రాజన్న సిరిసిల్ల, మార్చి 14:(నేటినిజం ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లఘనల పై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ (ఏ.ఈ.ఓ)లతో సమీక్షించారు.కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల పరిశీలక బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని సెక్షన్ 28 ప్రకారం మనమంతా భారత ఎన్నికల కమిషన్ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, మనం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, మన పారదర్శకత ప్రతి అంశంలో స్పష్టంగా కనిపించాలని , ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీను గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని, సి-విజల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

విధుల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్ బృందాలు నగదు ,ఇతర ఆభరణాలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించ వద్దని సూచించారు×

ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని అన్నారు. వీడియో సర్వేలెన్సు బృందాలు ,వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు ఎన్నికల నేపథ్యంలో జరిగే ప్రతి రాజకీయ సభలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, కుర్చీలు, స్టేజి, సౌండ్ ఏర్పాట్లు , భోజనం తదితర ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదు, రికార్డ్ చేయాలని అన్నారు.అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న×వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ× ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రశీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడం, ఖర్చు పై నివేదిక తయారు చేసే విధానం పై పి.పి.టి. ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీఓ రమేష్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్ రెడ్డి , అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఎవరు కావాలనుకుంటే.. వారే ఎన్నికల కమిషనర్లు

## – ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి

న్యూ డిల్లీ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీగా ఉన్న కమిషనర్ల పోస్టులను గురువారం కేంద్రం భర్తీ చేసింది. ప్రధాన మంత్రి అధికారిక నివాసంలో సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాని మోదీతో పాటు న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి హాజరయ్యారు. జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సంధులను కమిషనర్లుగా కమిటీ ఖరారు చేసింది. వీరి ఎంపికను కాంగ్రెస్ నేత వ్యతిరేకించారు. సమావేశం అనంతరం ఆయన కమిషనర్ల నియామక ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తారు.కేంద్రం ఎన్నికల కమిషనర్ల పేర్లను ఇప్పటికే ఖరారు చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఎవరు కావాలనుకుంటే.. వారే ఎన్నికల కమిషనర్లు' అని పేర్కొన్నారు. 'కమిటీలో ప్రభుత్వానికి మెజారిటీ ఉంది. దాంతో పేర్లను ఎంపిక చేసుకోవచ్చు. భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో కీలక పదవికి నియామకం ఈ పద్ధతిలో జరుగకూడదు. సమావేశానికి పది నిమిషాల ముందు నాకు ఆరు పేర్లు ఇచ్చారు. కాబట్టి ఇంత తక్కువ సమయంలో నేనేం చెబుతాను' అన్నారు. న్యాయశాఖకు బుధవారం ఆయన లేఖ రాస్తూ అభ్యర్థుల పేర్లు, బయోడేటా సమాచారం కోరితే 212 పేర్లు ఇచ్చారని.. ఇవాళ సమావేశానికి పది నిమిషాల ముందు ఆరు పేర్లను నిర్ణయించారని.. ఇందులో ఇద్దరిని ఎంపిక చేశారన్నారు.

కొత్త చట్టం ప్రకారం.. ఎన్నికల కమిషనర్‌ను ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కేబినెట్ మంత్రితో కూడిన కమిటీ నియమించింది. ఇదిలా ఉండగా.. సీఈసీ, ఈసీల నియామకంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

పాతచట్టం ప్రకారమే సీఈసీ, ఈసీలను నియమించాలని.. సెలక్షన్ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండేలా చూడాలని ఏడీఆర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఈ పిటిషన్‌పై త్వరలోనే సుప్రీంకోర్టు విచారించనున్నది.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ 'ఆది' సన్మానం



రాజన్న సిరిసిల్ల, మార్చి 14:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల వేములవాడ పట్టణ పద్మశాలి సంఘం నాయకులు గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు అవధూత రజనీకాంత్, సేవా సంఘం అధ్యక్షులు సిరిపురం రమేష్, కోడం గణేష్, నడిగట్ల బిక్షపతి, బైరి నాగరాజు, దూడం లక్ష్మణ్, వేముల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# విజయవంతంగా మెగా ఉచిత మెడికల్ క్యాంపు



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 14 (నేటినిజం ప్రతినిధి) :భద్రాచలం సారపాక గ్రామంలో జిపిఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో బ్రిందా హాస్పిటల్ మేనేజ్మెంట్ గుర్రం సత్యానారాయణ అధ్యర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్ లో డాక్టర్ పవన్, డాక్టర్ సాత్విక్, డాక్టర్ కృష్ణ సాగర్ పాల్గోన్నారు. 150మంది రోగులు క్యాంపుకు హాజరయ్యారు. దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలను బట్టి చాలా వరకు ఉచితంగానే మందులు అందించడంతో పాటు వైద్య సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిపిఆర్ ట్రస్ట్ సభ్యులు సురేష్, విక్రమ్, అచిత్, ఉపేందర్, అశోక్, నర్సు నవ్య, రాజేష్, గ్రామ సర్పంచ్ గ్రామస్తులు వసంత, లక్ష్మి, పద్మ, చిన్నా, చౌహాన్, నవీన్, అనిల్, జ్యోతి, సోనిరామి లక్ష్మిపవన్, రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ గెలిస్తే మోదీ కేబినెట్‌లో మంత్రి కావడం తథ్యం

-బీఆర్ఎస్ ను కూడా ఓడించవచ్చని నిరూపించిన తొలి ఎన్నిక దుబ్బాక
-బండి సంజయ్ రాష్ట్రమంతా ప్రచారం చేయాలి
-మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎన్.రఘునందన్ రావు

కరీంనగర్, మార్చి14: (నేటనిజం ప్రతినిధి) బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే నరేంద్రమోదీ కేబినెట్ లో మంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎన్.రఘునందన్ రావు అన్నారు. రాష్ట్రంలో ఎదురే లేదని విర్రవీగుతున్న బీఆర్ఎస్ ను కూడా ఓడించవచ్చని నిరూపించి వచ్చిన తొలి ఎన్నిక దుబ్బాక అని పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో తాను అభ్యర్థిగా నిలబడితే పోరాడి గెలిపించిన నాయకుడు బండి సంజయ్ అని పేర్కొన్నారు. సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో... కేంద్రంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రధాని కావడం అంతే నిజమని అన్నారు. రఘునందన్ రావును మెదక్ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో చొప్పదండి నియోజక వర్గంలోని బోయినిపల్లి మండలంలో ప్రజాహిత యాత్ర చేస్తున్న బండి సంజయ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోయిని పల్లి మండల కేంద్రంలో భారీ ఎత్తున



ప్రజలు తరలిరావడంతో బండి సంజయ్ తో కలిసి రఘునందన్ రావు ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా బండి సంజయ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 6 గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ దేశానికి దిక్సూచి మోదీ అని కొనియాడారు. కరోనా సమయంలో ఉచితంగా వ్యాక్సిన్ అందించి దేశ ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు...

# విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

చౌటుప్పల్ మార్చ్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్); విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఎదిగి దేశం కోసం ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దేవలమ్మ నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.గురువారావు పిలుపునిచ్చారు. గురువారం దేవలం నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శివయ్య గౌడ్ ఫౌండేషన్ తరఫున పరీక్ష ప్యాడ్ లు ,పెన్నులను మరియు ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలను పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈ గురువారావు శివ్వయ్య గౌడ్ ఫౌండేషన్ అధ్యక్షులు మురళి, శ్రీవల్లి, సమాచార హక్కు బాధ్యులు శేఖర్ ,ఉపాధ్యాయులు పద్మ, శివగ్న, గీతా రాణి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పలు సూచన చేశారు.

# మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు మృతి



మహబూబాబాద్, మార్చి 14 :(నేటినిజం ప్రతినిధి): టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పూర్వ చెన్నూరు పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వంలో ఆరో ఓగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్ రావు గత కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. మరియు మృతదేహాన్ని మరి స్వగృహం పెద్దవంగర మండలంలోని వడ్డగుత్తపెల్లి గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేయడం జరిగింది. వారి మృతి వార్త తెలిసిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఎందరో వారి భౌతిక కాయానికి పమాలలు వేసి నీవాళ్లు అర్పించాంు.వారి మృతి అత్యంత బాధాకరం ,నియోజకవర్గానికి తీరని లోటు అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి అన్నారు.మాజీ మంత్రి యతీరాజ రావు వారసుడిగా రాజకీయ నాయ కుడిగా ఒక వైద్యుడిగా అనేక వృత్తిలో తనదైన ముద్రవేసుకున్న గొప్ప నాయకుడు ప్రజా నేత నేమురుగొమ్ముల అని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి గారు అన్నారు. వారి భౌతిక కాయానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రఘాడసానుభూతిని వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు.

# కలెక్టర్ చేతుల మీదుగా టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా డైరీ ఆవిష్కరణ.

హన్మకొండ, మార్చి 14: (నేటినిజం ప్రతినిధి)వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఐఏఎస్ వరంగల్ జిల్లా టిఎన్జీవోస్ డైరీని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఐఏఎస్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉపయోగపడే జీవోలను, నియామ నిబంధనలను మరియు సర్వీస్ రూల్స్ ను ఒకే చోట పొందుపరచి ప్రభుత్వ శాఖల సమాచారాన్ని కూడా క్రోడీకరించి ఉద్యోగులకు ఉపయోగపడేలా డైరీని రూపొందించడం పట్ల టీఎన్జీవోస్ సంఘాన్ని అభినందించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ మాట్లాడుతూ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అన్ని విధాల సహాయ సహకారాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గజ్జెల రామ్ కిషన్, గాజె వేణుగోపాల్, సహాధ్యక్షులు హేమ నాయక్, కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులు గద్దల రాజు, దుర్గారావు, సంయుక్త కార్యదర్శులు నూతన్ పబ్లిసిటీ కార్యదర్శులు శంకేసి రాజేష్, సునితా నాయర్, జిల్లా బాధ్యులు సందీప్, శ్వేత, గణేష్, సిటీ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు వెలిశాల రాజు, మధుచంద్ర, కోశాధికారి శ్రీనివాస్, సుదర్శన్, ప్రశాంత్, నిరంజన్ రెడ్డి, చందు, నాగేశ్వరరావు, భాస్కర్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు రఘు, మహేందర్, సుమన్, సునీత, ప్రవీణ్ తదితర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటర్ మీడియట్ పరీక్షలను ఆకస్మిక తనిఖీ:జిల్లా కలెక్టర్



ఖమ్మం, మార్చి 14:(నేటినిజం ప్రతినిధి): ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వహణ సరళిని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరం (ఏఎస్ఆర్ )శాంతి నగర్ జూనియర్ కాలేజీ ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో కనీస మౌళిక సదుపాయాల కల్పన, ప్రహారీ గోడ భద్రత అంశాలను ఆయన పరిశీలించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి, ఎండల దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చీఫ్ సూపరింటెండెంట్ తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్షా నిర్వహణ విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి, లోనికి అనుమతించాలని, సెల్ ఫోన్ ను అనుమతించకూడదని కలెక్టర్ భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్, అధికారులు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లోకి వలసల జోరు

## – బండి వీరబాబు ఆధ్వర్యంలో పలు కుటుంబాలు చేరిక



ఖమ్మం, మార్చి 14:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బండి వీరబాబు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సమక్షంలో సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు పలు కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ వారిని సాదరంగా ఆహ్వానించి కాంగ్రెస్ కండువా కప్పి అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఆరు గ్యారెంటీల హామీ ఆకర్షించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ...పార్టీకి అండగా నిలబడి పార్టీని బలోపేతం చేస్తూ పార్టీ కోసమే పని చేస్తున్న బండి వీరబాబును ఆయన పనితీరును ప్రశంసించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని, ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండదండలుగా ఉండి కాంగ్రెస్ మేనిఫెస్టో లోని అంశాలను ప్రజలకు వివరించడంలో సహకరించాలని తెలిపారు. పార్టీని నమ్ముకుని వచ్చిన వారికి ఎప్పటికీ అండగా ఉంటామని తెలిపారు. మర్లపాడు గ్రామానికి చెందిన గర్నపూడి కన్నయ్య, నెలకుర్తి కృష్ణయ్య, గర్నపూడి కృపారావు, గర్నపూడి కృష్ణ, మోదుగు బోర్రయ్య, గర్నపూడి దావీదు, గర్నపూడి వెంకయ్య లతో పాటు మరి కొన్ని కుటుంబాలు చేరినట్లు తెలిపారు.

# తనకు పెన్నులపై ఉన్న మక్కువతో ఒక భారీ బాల్ పెన్ తయారు చేసిన తెలంగాణా వాసిని కలవండి.




హైదరాబాద్, మార్చి 14:నిజామాబాద్ కు చెందిన ఆచార్య మాకునూరి శ్రీనివాస తన అద్భుతమైన నైపుణ్యం, సృజనాత్మకతతో చరిత్రలో తనదంటూ ఒక చెరగని ముద్రను వేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన బాల్ పెన్ తయారు చేసి రికార్డులు బద్దలు కొట్టారు. 5.5 మీటర్ల ఎత్తుతో, 37.2 కిలోల బరువుండే ఈ ఊహాతీతమైన పెన్ కేవలం ఇంజినీరింగ్ ప్రజ్ఞ మాత్రమే కాదు. భారతీయ పురాణాల చిత్రాలు సొంపుగా చెక్కబడిన అత్యద్భుతమైన కాన్వాస్ కూడా. ఈ అసాధారణ కలం ఏలా తయారైందో తెలుసుకునేందుకు సోమవారం, మార్చి 18వ తారీఖున ప్రసారం కాబోతున్న 'హాఓఉ! యే మేరా ఇండియా' కార్యక్రమం చూడండి, కేవలం హిస్టరీ టీవీ 18లో. ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తూ తన పదో సీజన్‌కి చేరుకున్న ఈ ఫ్యాక్చువల్ ఎంటర్‌టైన్మెంట్ షో ప్రతి సోమవారం రాత్రి 8 గంటలకు ప్రసారమవుతుంది. తమ అసమానమైన ప్రతిభతో, వింత అభిరుచులతో, సమాజాన్ని ప్రభావితం చేస్తూ, సాంకేతిక అద్భుతాలను సృష్టిస్తున్న అబ్బురపరిచే, ఆహా అనిపించే వ్యక్తుల కథలను వీక్షకులకు అందిస్తూ తన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటోంది. శ్రీనివాస తయారు చేసిన పెన్, సాంప్రదాయ కళని, అధునాతన ఆవిష్కరణాలతో మేళవించాలనే ఆయన పట్టుదలకు చిహ్నం. అద్భుతమైన కథనాలు, సాంస్కృతిక ప్రాముఖ్యత ఉన్న భారతీయ పురాణాల చిత్రాలను ఈ పెన్‌పై చెక్కారు. ఆచార్య మాకునూరి శ్రీనివాస సాధించిన విజయం ప్రపంచం మొత్తం గుర్తించింది, ప్రశంసించింది. రోజువారీ వస్తువులలో కూడా ఎన్నో ఆవిష్కరణలు చేయవచ్చని చెప్పడానికి ఈ గుర్తింపు ఒక ఉదాహరణ. ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన ఈ బాల్ పెన్, ప్రయోజనకరమైన కళాత్మకతకి, పురాణ కథావ్యాప్తికి మధ్య ఒక వారధి లాంటిది. ఆ పెన్‌ను చూసిన వారందరిపైనా అదొక చెరగని ముద్ర వేస్తుంది. ఈ భారీ పెన్ రాబోయే కొన్ని తరాల కోసం చెరిగిపోని భారత పురాణాలను ఎలా సృష్టించిందో తెలుసుకోవడానికి తప్పక చూడండి... 'హాఓఉ! యే మేరా ఇండియా', ఈ సోమవారం రాత్రి 8 గంటలకు! నిజామాబాద్‌లో తయారైన ఈ భారీ పెన్‌ను చూసి ఆశ్చర్యపోవడం ఇప్పుడు మీ వంతు. ఇదే కాదు, 40,000 అడుగుల ఎత్తు నుండి స్కైడైవ్ చేస్తున్న కొచ్చి వ్యక్తి, ఇలా ప్రేరణ పంచే దేశవ్యాప్తంగా మరెందరో వ్యక్తుల కథలను తెలుసుకోండి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.